

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శని) సా.6.22
సహరి(ఆది) ఉ.4.49

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	37.0	23.0



నిడదవోలు ఆర్వోబీ పనుల వద్ద మట్టిలో దిగబడిన లారీ



లారీ బయటకు వచ్చిన తరువాత మిగిలిన గొయ్యి

ఫ్లయ్ ఓవర్ కష్టాలు

- ఆర్వోబీ నిర్మాణంతో ప్రజలకు తప్పని ఇక్కట్లు
- నిర్మాణ పనుల వద్ద కానరాని భద్రత చర్యలు
- ఇష్టారాజ్యంగా జరుగుతున్న పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పర్యవేక్షించని ప్రభుత్వ అధికారులు..పాలకులు

నిడదవోలు, మార్చి 15 : ప్రజలకు ఫ్లయ్ ఓవర్ కష్టాలు తప్పడం లేదు. పాలకుల చేతగానితనం.. అధికారుల అలక్ష్యం.. కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది.. ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నా తీరు మారడంలేదు.. ఏ రోజుకారోజు బాగుపడుతుందిలే అనుకుంటే రోజురోజుకు సమస్య తీవ్రమవుతుండడంపై ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు ఆర్వోబీ నిర్మాణం గోదావరి జిల్లాల ప్రజల చిరకాల కోరిక..ఈ ఆర్వోబీ పనులు ఆరంభమైన నెల రోజుల్లోనే ప్రజలు మా కొద్దు బాబోయ్ అనేలా అవస్థలు పడుతున్నారు. ఈ పనుల వద్ద ఎటువంటి భద్రత చర్యలు తీసుకోకపోవడంతో ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నిడదవోలు నెహ్రూ బొమ్మ సెంటరులో ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో సుమారు రెండు నెలల కిందట మెయిన్ రోడ్డు నుంచి గాంధీ బొమ్మ సెంటరు వరకు ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ఈ పనుల కారణంగా స్థానికులతో పాటు ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులంతా అవస్థలు పడుతున్నారు. ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనుకుంటూ భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్వోబీ నిర్మాణ పనుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం..ఇష్టానుసారంగా పనులు సాగుతుండడంతో భయపడుతున్నారు. అయితే ఆర్‌వోబీ నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తా లేకుండా పోవడంతో రోజురోజుకు సమస్య జఠిలమవుతోంది. ఒక పక్క ఆర్వోబీ నిర్మాణ పనులు సాగుతుండగానే దానిని అనుకునే స్కూల్ బస్సులు, భారీ లారీలు, రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఒక్కసారిగా భారీ లారీ ముందు టైరు దిగబడిపోయింది. అప్పటికే ఆ ప్రాంతంలో భూమిలోకి వేసిన రెండు పిల్లర్ల మధ్య దిగబడిపోవడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. మరోపక్క దిగబడిన లారీ మెల్లమెల్లగా దిగబడిపోతూ గొయ్యి పెద్దది అవుతుండడంతో భారీ క్రేన్‌తో లారీని బయటకు లాగించారు. తీరా చూస్తే రెండు పిల్లర్ల మధ్య భారీ గొయ్యి అలాగే ఉండిపోయింది. ఆర్వోబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పనులను పరిశీలించడం కాని, అధికారులను సమన్వయ పరచి సజావుగా ఆర్వోబీ పనులు జరిగేలా చర్యలు తీసుకోవడం లేదని ఇటు పట్టణ ప్రజలు, కంపెనీ ప్రతినిధులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

జిల్లా పశుసంవర్ధక అధికారిగా శ్రీనివాసరావు



రాజమహేంద్రవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పశు సంవర్ధక శాఖాధికారిగా టి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.అనంతరం కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నిర్దేశిత పాల సేకరణ లక్ష్యాల ప్రకారం జిల్లాలో ఆయా పాల కేంద్రాల నుంచి ప్రతి రోజూ 160 లీటర్ల పాలను సేకరించడానికి చేపట్టిన ప్రణాళికను పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. 1993లో సహాయ పశు వైద్యాధికారిగా చిలకలూరిపేట మండలంలో శ్రీనివాసరావు పశు సంవర్ధక శాఖలో ఉద్యోగ జీవితం ఆరంభించారు.వృత్తిలో అంకిత భావంతో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారు.గుంటూరు జిల్లా తాడికొండ ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో సహాయ సంచాలకుడిగా పనిచేస్తూ ఉప సంచాలకుడిగా జిల్లాకు వచ్చారు.



ఇంటర్ పరీక్ష ముగిసిన అనంతరం బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

గోపాలపురం, మార్చి 15 : ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఎక్కడా ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జరిగిన ఈ పరీక్షలకు రెండు పరీక్షా కేంద్రాలు అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఏ జిల్లా పరిధిలోని విద్యార్థులు ఆ జిల్లాలోనే పరీక్షలు రాయాలని అధికారుల నుంచి ఆదేశాలు అందాయి.ఈ మేరకు అదే విధంగా జరిగాయి.తూర్పుగోదావరి జిల్లాలో కొత్తగా 10 మండలాలు కలిశాయి. ఆయా మండలాల విద్యార్థులు జిల్లా పరిధిలోనే పరీక్షలు రాశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.పరీక్షల చివరి రోజు కావడంతో తల్లిదండ్రులు విద్యార్థుల వెంట తరలి వచ్చారు. పరీక్ష ముగిసిన వెంటనే తమ వెంట తీసుకుపోయారు. కొంత మంది విద్యార్థులు మాత్రం పరీక్షలు ముగియడంతో స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపారు. గురువారం జూనియర్ ఇంటర్ పరీక్షలు ముగిశాయి.

నేడు మోగనున్న నగారా

- నేడే ఎన్నికల షెడ్యూల్ విడుదల
- 3 గంటల నుంచి కోడ్ అమలు
- ప్రలోభాలకు తెరలేపిన వైసీపీ
- ఆవ భూముల పట్టాలు పంపిణీ

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల మూడ్‌లోకి పూర్తిగా వెళ్లిపోయే సమయం ఆసన్నమైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ వచ్చేస్తోంది.కేంద్ర ఎన్నికల సంఘం శనివారం సాయంత్రం 3 గంటలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనుంది. షెడ్యూల్ జారీ అయినప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఇక ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు ఉండవు.. రాజకీయ నాయకుల పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు అన్ని తొలగించాల్సి ఉంటుంది. కొత్త పథకాలు ప్రారంభం కాని, అభివృద్ధి పనుల ప్రారంభం కాని ఉండవు. షెడ్యూల్ ప్రకటన తరువాత నోటిఫికేషన్ జారీ అవుతుంది. షెడ్యూల్ ప్రకటన రానుండడంతో జిల్లా రాజకీయ పార్టీల్లో ఉత్సాహం పెరిగింది. ఇప్పటికే టీడీపీ, జనసేన అసెంబ్లీ అభ్యర్థుల అందరూ ఖరారైన సంగతి తెలిసిందే. వైసీపీ మొత్తం అన్ని నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను శనివారం అధికారికంగా ప్రకటించనుంది.ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి ప్రకటన రేపో మాపో రానున్నది.టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన తరువాత లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించినట్టు తెలిసిందే. శనివారం సాయంత్రానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఇప్పటికే ఖరారైన అభ్యర్థులతో పాటు టిక్కెట్లను ఆశించేవారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులు ఒక ప్రణాళికాబద్ధంగా ప్రచారం ఆరంభించారు. తమ మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికి ప్రచారం చేస్తున్నారు.

స్థలం చూపకుండానే.. ఇళ్ల పట్టాలు..

ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోపు ఉన్న ప్రతి క్షణాన్ని ప్రలోభాలకు వినియోగించుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తుంది. ఇప్పటికే వైసీపీ అభ్యర్థులు చీరలు, రకరకాల వస్తువులతో ప్రలోభాలకు తెరలేపారు. నేటి మధ్యాహ్నం 3 గంటల వరకూ అవకాశం ఉండడంతో మరింత రెచ్చిపోతారు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో సుమారు నాలుగేళ్ల కిందట ఆవ భూముల్లో ఇళ్లపట్టాలు ఇవ్వడానికి హామీపత్రాలు ఇచ్చిన లబ్ధిదారులకు 2 రోజుల నుంచి హడావుడిగా పట్టాలు పంపిణీ చేస్తున్నారు. కొంత మంది లబ్ధిదారులకు అసలు భూములు చూపించకుండా, మరికొందరికి అసలు భూమి లేకుండానే పట్టాలు ఇచ్చేయడం గమనార్హం. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లో కూడా ఇదే తతంగం నడుస్తుంది. సచివాలయాల ఉద్యోగుల ద్వారా పట్టాలు పంపిణీ చేయడం విశేషం. తమకు భూములు ఎక్కడ ఇస్తున్నారని అడిగితే ముందు పట్టాలు తీసుకోండి వారం రోజుల్లో భూములు చూపిస్తామంటున్నారు. ఏదో విధంగా మభ్యపెట్టి ఓటు పొందాలని చూస్తున్నారు. ఇప్పటికే చీరలు, గిఫ్టులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

ఎటు చూసినా వీళ్లే!

ఇదేం ఖర్మరా బాబూ!



- ఓటు అడిగే త్రోవ లేక.. ప్రచార యావ!?
- రోడ్లు.. హోర్డింగ్‌లు.. ఇళ్లకూ వైసీపీ ఫ్లెక్సీలే
- రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటుతో ట్రాఫిక్ ఇబ్బందులు
- బాబోయ్ చూడలేకపోతున్నామంటున్న జనం
- బహిరంగ సభ మైదానాలపై ఖర్చీఫ్
- కనీస అనుమతులు లేకుండానే ఏర్పాటు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎటు చూడు వైసీపీ హోర్డింగ్స్.. కటౌట్లే.. ఏ ఫ్లెక్సీ చూసినా సిద్ధం సిద్ధం అంటున్నారు.. ఐదేళ్లలో అభివృద్ధి చేయడం చేతగాని వైసీపీ నాయకులు ఎన్నికల నియమావళికి కూతవేటు దూరంలో ఒక పక్క సిద్ధం అంటూ మరో పక్క నాకో కల ఉంది అంటూ ఓట్ల కోసం వల వేస్తున్నారు. అయితే ఓటర్లు ఒక్క చాన్స్ అంటే ఐదేళ్ల అవకాశం ఇచ్చాం.. మోసపోయాం.. సిద్ధం అంటే ఎలా ఇస్తాం.. అంటున్నారు. జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా ఫ్లెక్సీలతో ఊదరగొట్టేస్తున్నారు. గుడి దగ్గర, బడి సమీపంలో, జంక్షన్ల నిండా, డివైడర్ల మధ్యలో స్తంభాలకు, బస్ షెల్టర్లకు.. ఎక్కడ చూసినా వైసీపీ బొమ్మలతో కూడిన పోస్టర్ల, తాత్కాలిక ద్వారాలతో నింపేస్తున్నారు. ప్రతిపక్షాల ప్రచారానికి చోటు లేకుండా చేయాలనే కుతంత్రాలతో కొందరు నాయకులు సభా మైదానాలు, హోర్డింగ్ లను రోజుల పాటు బుక్ చేసేసుకున్నారు. దీనికి తోడు మొబైల్ ప్రచార వాహనాలతో హోరెత్తిస్తున్నారు. రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంలో ఎక్కడ చూసినా ఎంపీ భరత్‌రామ్ ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. వీటిపై 'అభివృద్ధికి సిద్ధం' అని ఉండడం చూస్తున్న జనం.. ఈ నాలుగేళ్ల పది నెలల్లో అభివృద్ధి చేయకుండా మళ్లీ 'సిద్ధమే మిటి?' అని ప్రశ్నిస్తున్నారు. అధికారం మాటున ఏర్పాటు చేస్తున్న ఈ ప్రచార బోర్డులకు వేటికీ అనుమతులు లేకపోవడం గమనార్హం.

ఎందుకీ చిన్నెలు..

జిల్లా వ్యాప్తంగా తరచుగా సభలు ఏర్పాటు చేసుకునే మైదానాలను వైసీపీ నాయకులు 20 రోజుల వరకూ ముందస్తుగా వివిధ పేర్లతో చేబట్టారని తెలుస్తోంది. అలాగే ప్రైవేటు వారి చేతుల్లో ఉండే హోర్డింగులను భయాన చెరబట్టారని సమాచారం. దీంతో ఎక్కడ హోర్డింగులు చూసినా వైసీపీ ఫ్లెక్సీలే కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని హోర్డింగులను నెల రోజులకు వైసీపీ నేత తన గుప్పిట్లో బంధించేశారని సమాచారం. అలాగే సిటీలో సభలకు అనుకూలంగా ఉండే సుబ్రహ్మణ్య మైదానాన్ని 20 రోజుల పాటు బుక్ చేసుకున్నారని తెలుస్తోంది. దీంతో మైదానంలో వైసీపీ కటౌట్లను, ఫెక్సీలను తొలగించకుండా రోజూ అలాగే ఉంచుతున్నారు.వైసీపీ నాయకులు ఇష్టానుసారం ఫెక్సీలు, హోర్డింగులు, బోర్డులు, పోస్టర్లు పెడుతుండడం అటు అధికారులకూ చిరాకు రప్పిస్తోందని అంటున్నారు. అధికార పార్టీ కావడం, వారు అడ్డమైన మార్గాల్లో వెళతారనే అనుభవం ఉండడంతో వెనకడుగు వేస్తున్నారు.ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన మరుక్షణమే కటౌట్లు దించేయడానికి, హోర్డింగులపై ఫెక్లీలు తొలగించడానికి అధికారులు 'సిద్ధం'గా ఉన్నారని చెబుతున్నారు.సిబ్బందికి ఈ మేరకు అధికారులు మౌఖిక ఆదేశాలూ జారీ చేశారట. దీంతో నోటిఫికేషన్ వచ్చీ రావడంతో ఫ్లెక్సీలను తొలగించే పని పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. పర్యావరణానికి హానికరమైన ఈ ఫెక్సీలను ఏ విధంగా ధ్వంసం చేస్తారోనని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా గతేడాది మే నెలలో జరిగిన మహానాడులోనూ వైసీపీ నాయకులు ఇలాగే అడ్డుతగిలారు..నాడు జనం వైసీపీ అడ్డంకులను అధిగమించి మహానాడు విజయవంతం చేశారు. ఎన్నికల వేళ ఇబ్బందులు పెడుతున్నారు. టీడీపీ ఫ్లెక్సీలు చించివేసి.. హోర్డింగ్‌లు అద్దెకు ఇవ్వకుండా చేస్తున్నారు. దీంతో ఎన్నికల్లో కూడా తమదే విజయమని టీడీపీ నాయకులు అంటున్నారు.

అభివృద్ధి చేతకాక..

జగన్ కల్లబొల్లి మాటలను నమ్మి జనం అధికార పీఠం ఎక్కించి నాలుగేళ్ల పది నెలలైంది. ఇప్పటి వరకూ చేసిన అభివృద్ధి గురించి వైసీపీ నాయకులు స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. పంచాయతీలకు వచ్చిన కేంద్ర నిధులతో చేసిన పనులనూ వైసీపీ పాలకుల ఖాతాలో వేసుకున్నారు.ఆ నిధులతో కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్లపై కూడా వైసీపీ నాయకులు బొమ్మల ప్రదర్శన చేశారు. ఏ నియోజకవర్గంలోనూ చెప్పుకోదగిన పనులు జరగలేదనేది వాస్తవంగా కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఆర్భాటాలు తప్ప చిత్తశుద్ధి లేదని జనం విమర్శిస్తున్నారు. ఇన్నాళ్లలో కుడి చేతితో పంచేసి ఎడమ చేతితో పిండేయడం తప్ప ఏ వర్గాలకూ వైసీపీ ప్రభుత్వం చేసిన మేలు లేదు. రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, మంచినీటి సదుపాయం వంటివేమీ పట్టించుకోలేదు. గోదావరి నది పక్కనే ఉన్నా ఈ నాటికీ నీటి కోసం కటకటలాడే ప్రాంతాలు రాజమహేంద్రవరం చుట్టుపక్కల గగ్గోలు పెడుతున్నాయి. ఈ నాలుగేళ్ల పది నెలలూ ప్రధాన సమస్యలను 'గాలి'కి వదిలేయడంతో ఇప్పుడు ప్రజల వద్దకు ఓటు కోసం ఎలా వెళ్లాలో ముఖం చెల్లని వైపీపీ నాయకులు చీరల పంపిణీ, ఫ్లెక్సీలతో అవాస్తవ ప్రచారాలనే నమ్ముకోక తప్పని పరిస్థితి వచ్చింది.

హద్దులే లేని ప్రచార పిచ్చి..

కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం, రాజానగరం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్‌లో చిన్న చిన్న రోడ్లను కూడా వైసీపీ పోస్టర్లతో నింపేశారు. ప్రచార యావ బాగా తలకెక్కిన వైసీపీ నాయకులకు ప్రజల ఇబ్బందులు పట్టడంలేదు.జిల్లా కేంద్రమైన రాజమహేంద్ర వరంలోని గోదావరి గట్టు, పుష్కరఘాట్ తదితర ప్రాంతాల్లో సాధారణంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం వేళల్లో ఇక్కడ ట్రాఫిక్ నియంత్రించడంలో పోలీసులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటారు. వాహనదారులు నరకం చూస్తూ ఉంటారు. ఈ ఇక్కట్లు కూడా వైసీపీ నాయకులకు కనిపించడం లేదు. పుష్కర్‌ఘాట్, గోదావరి గట్టుపైన ఉమామార్కండేయ స్వామి దేవాలయం వద్ద వైసీపీ నాయకులు తాత్కాలిక ద్వారాలు ఏర్పాటు చేశారు. ఈ ద్వారాలతో ఆ ప్రాంతాలు మరింత ఇరుకుగా మారిపోవడంతో ట్రాఫిక్‌కి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డివైడర్ల మధ్య, రోడ్ల పక్కన కరెంటు స్తంభాలను వైసీపీ ఫ్లెక్సీలతో నింపేశారు. ఇక సులభ్ కాంప్లెక్సులు ఒకటే మిగిలి ఉన్నాయని జనం ఎద్దేవా చేస్తుండడం గమనార్హం. కటౌట్లకు, ఫెక్సీల ఏర్పాటుకు అనుమతుల్లేకపోయినా అధికారులు నోరెత్తలేని పరిస్థితి.





ఇది తగునా : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద శివరాత్రి రోజున రోడ్డు మధ్యన పెట్టిన ఫ్లెక్సీలు.. నాటి నుంచి ఇలాగే వదిలేశారు..





జయహో బీసీ సభకు హాజరైన అశేషజనం.. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరికి తెలుగు మహిళల పూలమాల

రాష్ట్రానికి ఏం చేశావని ఓటెయ్యాలి!

- జగన్ పాలనపై మండిపడిన అయ్యన్న
- కూటమిని గెలిపిస్తేనే రాష్ట్ర భవిష్యత్
- ఆలోచించి ఓటెయ్యాలని పిలుపు
- జయహో బీసీ సభ విజయవంతం

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం మార్చి 15 : అసలు రాష్ట్రానికి ఏమి చేశావు జగన్? ఓ పోలవరం చేశావా ? ప్రత్యేకహోదా తెచ్చావా ? పరిశ్రమలు తెచ్చావా ? నిరుద్యోగ సమస్య తీర్చావా ? ఏమి చేశావని నీకు ఓటెయ్యాలో చెప్పు అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మరో మూడు నెలల్లో జగన్ జైలుకెళ్లడం ఖాయం అన్నారు. చివరి రక్తపు బొట్టు వరకు గోరంట్ల, నేను పార్టీ కోసం పనిచేస్తాం.మేము చచ్చే వరకు పార్టీని కాపాడుకుంటాం..చచ్చాక కూడా పార్టీ జండా కప్పుకుంటాం అన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి టీడీపీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. పెన్షన్ పథకాన్ని అన్న ఎన్టీఆర్ పెడితే దానిని పెంచింది చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల వాటా 24 శాతం ఎన్టీఆర్ పెడితే దానిని 34 శాతానికి చంద్రబాబు పెంచారని చెప్పారు. ఇపుడు జగన్ దానిని 24 శాతానికి తగ్గించడం వల్ల రాష్ట్రంలో బీసీ వర్గాలకు చెందాల్సిన 16 వేల పదవులు పోయాయన్నారు. చేతి వృత్తులకు ఆదరణ కరువైందన్నారు. రాష్ట్రంలో 279 మంది బీసీలు ఈ నాలుగేళ్ల 11 నెలల కాలంలో హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బీసీ రక్షణ చట్టాన్ని తెస్తున్నట్టు తెలిపారు. రూరల్ నియోజకవర్గం విషయానికి వస్తే ఒక చోట పనిచేయని అవినీతి మంత్రిని అక్కడ ప్రజలు తిరస్కరిస్తే రూరల్‌కు పంపించారని, అక్కడ గుళ్ళు, గోపురాలు, కాలవగట్లు, అన్ని ఖాళీ చేసిన అమాత్యులు ఇక్కడ దోపిడీకి వచ్చారన్నారు. ఆలీబాబా 40 దొంగల్లాగా ముఠాలుగా ఒకరే ఈ మంత్రి అని ఆరోపించారు. ఈయన పాత్రలు, చీరలు పంపిణీ చేసి ఓటర్ల ప్రలోభానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ భరత్‌రామ్ పనికిరాని భూములను కొనుగోలు చేయించి మరో చోట భూములకు బోగస్ పట్టాలు తయారు చేసి మభ్యపెడుతున్నాడని అవి ఎందుకు పనికిరావన్నారు. దగా పడ్డ ప్రజలు ఆలోచించుకుని దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని..బీసీలంతా ఏకమై కూటమిని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. టీడీపీ సీనియర్‌నేత వినుకొండ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీ వర్గాల అభ్యున్నతికి చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. బీసీల అభ్యున్నతి తెలుగుదేశంతోనే సాధ్యం అని రూరల్ నుంచి పోటీ చేస్తున్న గోరంట్లను గెలిపించాలని కోరారు. నూర్ బాషా సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమైందన్నారు. డా.వెంకటరమణ మాట్లాడుతూ బీసీ వర్గాలకు చెందిన పిల్లలు చదువుల్లో రాణించడానికి ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన పథకాలే కారణం అన్నారు. గోరంట్ల, అయ్యన్నపాత్రుడు ఇద్దరినీ గజమాలతో సత్కరించారు. అటుపై గోరంట్ల పుట్టిన రోజు పురస్కరించుకుని వేదికపై కార్యకర్తలు, నాయకులు సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గోరంట్ల కుమార్తె శిరీష, టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, యర్రా వేణుగోపాలరాయుడు, వాసిరెడ్డి రాంబాబు, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ, మార్ని వాసు, పండూరి అప్పారావు, ప్రత్తిపాటి రామారావు చౌదరి, పిన్నింటి ఏక బాబు, పితాని శివరామకృష్ణ, దండమూడి ప్రసాద్, ముత్తాబత్తుల విజయ, గుత్తుల కృష్ణ, యార్లగడ్డ శేఖర్, యనమదల రాజు, బత్తిన ఏడుకొండలు, ధర్మరాజు, దండమూడి ప్రమీల,జోగి చక్రవర్తి, కొయ్యనకుమారి, మత్యేటి ప్రసాద్, ప్రత్తిపాటి రామారావుచౌదరి, యార్లగడ్డ శేఖర్ తదితరులు పాల్గొన్నారు



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రతిష్ఠించనున్న శిఖరాలు

వాడపల్లి వెంకన్న ఆలయంలో నేడు, రేపు

స్వర్ణ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వర్ణ శిఖర ప్రతిష్ఠను ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వ హించనున్నారు. వేంకటేశ్వరస్వామి, క్షేత్ర పాలకుడు గోపాలస్వామి, మహాలక్ష్మి అమ్మవారు, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాలకు స్వర్ణ శిఖరాలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సహకారంతో దాతల విరాళాలు రూ.35 లక్షలతో చేయించారు. మహోత్సవానికి ఏర్పాట్లుచేసినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

దేవదానం రాజుకు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం



యానాం, మార్చి15: కవి, కథకుడు, బహుగ్రంథకర్త దాట్ల దేవదానం రాజుకు సృజనాత్మక సాహిత్యం విభాగంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ టి.కిషన్‌రావు ఈ మేరకు ప్రకటన జారీచేశారు. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాదు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగే సభలో దేవదానం రాజు ఈ పురస్కారాన్ని స్వీకరిస్తారు. కథలు, కవితలు, చరిత్ర, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియల్లో చేసిన సాహిత్య కృషిని పరిగణలోకి తీసుకుని ఇస్తున్న పురస్కారం గర్వకారణంగా ఉందని, ఆదీ సప్తతి పుట్టినరోజున ప్రతిష్ఠాత్మకమైన తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్ని స్వీకరించడం మరింత సంతోషంగా ఉందని దాట్ల అన్నారు. ఏడు కవితా సంపుటాలు, ఐదు కథా సంపుటాలు, రెండు దీర్ఘకవితలు, చరిత్ర గ్రంథం, నవల, రాజకీయ వ్యంగ్య కథన చమత్కారాలు వంటి పుస్తకాలను వెలువరించడం జరిగిందన్నారు. ఫ్రెంచ్, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనేక కథలు, కవితలు అనువాదం అయ్యాయన్నారు. కాగా దేవదానంరాజు గతంలో కళైమామణి, తెలుగురత్న, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, మధుశ్రీ, కథ గౌరవం, డాక్టర్ పరుచూరి పురస్కారం, కుందుర్తి శతజయంతి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం వంటివి అందుకున్నారు. ఇప్పుడు కీర్తి పురస్కారానికి ఎంపికైన దేవదానంరాజుకు ప్రముఖ కవులు, సాహివేత్తలు కళైమామణి విష్ణుమూర్తి, శిఖామణి, పీఆర్ఎల్ స్వామి, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, ముమ్మిడి నాగప్రసాద్, చింతా కొండలరావు, జిమ్మి, రామ్మోహనరావు, డాక్టర్ శివప్రసాద్ తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



మొసలపల్లి వద్ద లారీ బోల్తాపడిన దృశ్యం

రొయ్యలమేత లోడు లారీ బోల్తా

అంబాజీపేట, మార్చి 15: రొయ్యల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి మొసలపల్లి ప్రధాన రహదారిలో బోల్తాపడింది. కొవ్వూరు నుంచి అమలాపురం వైపు రొయ్యల మేతతో వెళ్తున్న వ్యాను ముక్కామల- ఈదరపల్లి రోడ్డులో మొసలపల్లి దగ్గరకు వచ్చేసరికి అదుపుతప్పి పక్కనున్న గోతులో బోల్తాపడింది. అయితే వ్యానులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. నిత్యం రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో ప్రమాదం జరిగిన సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీనిపై ఏ విధమైన కేసు నమోదు కాలేదు.



తాడేపల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు గిరి

జిల్లా బీసీ సంక్షేమ సాధికారతాధికారిగా లల్లి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15: కాకినాడ జిల్లా బీసీ సంక్షేమ సాధికారతాధికారిగా ఎం.లల్లి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను కలిశారు.



హుకుంపేటలో జరిగిన జయహో బీసీ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, గోరంట్ల తదితరులు

99 శాతం పనులు పూర్తి చేశావా ?

- ఏదీ.. ఎక్కడ.. సిగ్గు లేదూ..
- కడప పులివి కాదు.. పిల్లివి
- జయహో బీసీ సభలో జగన్‌పై మండిపడ్డ మాజీ మంత్రి అయ్యన్న, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం మార్చి15: ఏటి? రాష్ట్రంలో 99 శాతం పనులు పూర్తి చేశావా? ఏది ఎక్కడా కనబడుట లేదు. సిగ్గులేదా జగన్ నీకు ఆ మాట అనడానికి.. నువ్వు దగా కోరువి. నువ్వు కడప పులివి కాదు.. పిల్లివి.. అందుకే నీవంటే గౌరవం లేదు అని మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామం జాతీయ రహదారి పక్కన మైదానంలో శుక్రవారం రాత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. నాపై 16 కేసులు పెట్టావు? నువ్వు చేసిన తప్పులను ప్రశ్నించినందుకు సీఐడీ ప్రయోగించావు. ఏంపీకారు అన్నారు. అసలు రాష్ట్రానికి ఏమి చేశావు జగన్? ఓ పోలవరం చేశావా? ప్రత్యేకహోదా తెచ్చావా? పరిశ్రమలు తెచ్చావా? నిరుద్యోగ సమస్య తీర్చావా? ఏమి చేశావని నీకు ఓటెయ్యాలో చెప్పు అన్నారు. ఏదీ ఇప్పుడు రాష్ట్రంలో పాదయాత్ర చేయి చూద్దాం... జనాలు తరిమేత్తారు మిమ్మల్ని. అమ్మలారా.. అయ్యలారా మీ పెన్షన్ జగన్ నొక్కేశాడు. మీకు తెలియడం లేదు. రూ.3 వేలు పెంచుతానని చెప్పాడు. రూ.250 చొప్పున పెంచుకువచ్చాడు. ఇలా పెంచడం వల్ల మీకు జరిగిన నష్టం ఎంతో తెలుసా? ఒక్కొక్క పెన్షన్‌దారుడు రూ.27,500 నష్టపోయాడు. ఇలా చాలా ఉన్నాయి... ప్రజలారా మేల్కోండి. ఇలా నమ్మితే మొత్తం ఆస్తులన్నీ పోగొట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలతోపాటు ఈ దుర్మార్గుడు ఉద్యోగులను మోసం చేశాడు. 60 లక్షల మంది ఉద్యోగులు ఇతని వల్ల మోసపోయారు. సీపీఎస్ రద్దన్నాడు. చేతులెత్తేశాడు. పోలీసులకు కూడా చెబుతున్నాం. తొత్తులుగా మారొద్దు. ఆలోచించుకోండి. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం బాగుపడుతుంది. 140 బీసీ కులాలకు లబ్ధి చేకూరుతుంది అన్నారు.

చీరలొద్దు.. చేతనైతే విద్యుత్ చార్జీలు తగ్గించండి!

సబ్‌స్టేషన్‌లోకి వైసీపీ చీరలు విసిరిగొట్టి మహిళల ధర్నా



జాంపేట సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు.. మద్దతు తెలుపుతున్న ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15: రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు చేతనైతే విద్యుత్ చార్జీలు తగ్గించాలేతప్ప చీరలు పంచడం కాదని మహిళలు ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరం 30వ డివిజన్‌కు చెందిన మహిళలు జాంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎంపీ భరత్‌రామ్ ఇచ్చిన చీరలతో నిరసన ప్రదర్శన, ధర్నా చేశారు. ఈ ఆందోళనకు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఉన్నట్టుండి ఎందుకు భరత్‌రామ్ మహిళలపై నీకు అంత అభిమానం పుట్టుకొచ్చిందని ప్రశ్నించారు. చీరలు సారెలు పెట్టి ఓట్లకు గేలం వేయాలని చూస్తున్నావుకానీ నీ చర్యను మహిళలంతా అసహ్యించుకుంటున్నారన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అప్పుడు ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మహిళలు ఎంపీ ఇచ్చిన చీరలను సబ్‌స్టేషన్‌లోకి విసిరికొట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, డివిజన్ అధ్యక్షుడు ఎరక కొండ, నాయకులు కిష్టాపర్, టిల్లు, తుత్తరపూడి రమణ, నరాల రమణమూర్తి, చాపల చిన్నరాజు, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, రెల్లా సత్తిబాబు, ఈపి కిషోర్, తుళ్లి పద్మ పాల్గొన్నారు.

చంద్రబాబు ముందుకు రంప టికెట్ పంచాయితీ

నియోజకవర్గ పరిస్థితులను వివరించిన మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి, వంతల

చంద్రబాబు నివాసం వద్ద వంతలకు అనుకూలంగా ఆందోళన చేసిన ఆమె కేడర్



చంద్రబాబు నివాసం వద్ద రంపచోడవరం టీడీపీ శ్రేణులు ఆందోళన చేస్తున్న దృశ్యం

రంపచోడవరం, మార్చి15: రంపచోడవరం నియోజకవర్గ టీడీపీ టికెట్ మిరియాల శిరీషకు ఖరారు చేసిన అనంతరం ఆమెను వ్యతిరేకిస్తూ నియోజకవర్గ తాజా మాజీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా నాయకురాలు గొర్లె సునీత, వారి అనుచరవర్గం శుక్రవారం చంద్రబాబును కలిసి పరిస్థితిని వివరించారు. గురువారం నుంచి రంపచోడవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వంతల శిబిరంలో ఆమెకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. అలాగే శుక్రవారం ఉదయం పెద్దఎత్తున వాహనాల్లో నాయకులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. చంద్రబాబు నివాసం ముందు నాయకులు, కార్యకర్తలు వంతలకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈలోగా తాము కలిసి పరిస్థితిని వివరించాలనుకుంటున్నామని శీతంశెట్టి, రాజేశ్వరిలు చంద్రబాబు వద్దకు కబురుపంపగా నలుగురికి అవకాశం ఇచ్చారు. బాబును కలిసిన శీతంశెట్టి, రాజేశ్వరి, గొర్లె సునీత, శివాజీలు రంప టికెట్‌ను మార్చాల్సి ఉన్నదని కోరారు. కాగా అన్ని సర్వేలు చేసి టికెట్‌ను ఖరారు చేశామని చంద్రబాబు వివరించగా, ఇప్పుడు టికెట్ మార్చకుంటే పార్టీ దెబ్బతింటుందని చెప్పగా పరిశీలిస్తామని బాబు హామీ ఇచ్చారని నలుగురు నాయకులు మీడియాకు చెప్పారు.



టీ దోమ ఆశించడంతో మాడిపోయిన జీడిమామిడి తోట

ఏమిటీ కష్టం!

- జీడిమామిడికి ఆశిస్తున్న టీ దోమ
- ముందే గుర్తించిన ఉద్యానశాఖాధికారులు
- మాడిపోతున్న పూత
- పిందె దశలో రాలిపోతున్న పిక్కలు
- అప్రమత్తమైన అధికారులు
- నివారణా చర్యలు చేపట్టకపోతే దిగుబడులపై ప్రభావం
- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన
- ఆందోళన చెందుతున్న జీడిమామిడి రైతులు



టీ దోమ

పెద్దాపురం, మార్చి 15: జీడిమామిడి ఉద్యాన వాణిజ్య పంటల్లో ప్రధానమైనది. డ్రైఫ్రూట్ పంటల్లో అధికంగా తినబడే జీడిపప్పు పంట చేతికి రావాలంటే చాలా పురుగుల దాడులు తట్టుకోవాలి. ఇందులో జీడిమామిడికి కాండం, వేరు తొలిచే పురుగు తర్వాత అధిక నష్టం కలిగించేది తేయాకు దోమ (టి దోమ). ఇది నిజంగా దోమకాదు. కూర్చున్నప్పుడు దీని శరీర నిర్మాణం దోమలాగ ఉండడం, తేయాకు తోటల్లో ఎక్కువగా కనిపించడం వల్ల దీన్ని తేయాకు దోమ అని పిలుస్తుంటారు.

జిల్లావ్యాప్తంగా 11,335 హెక్టార్లల్లో సాగు

జీడిమామిడి సాగు కాకినాడ జిల్లావ్యాప్తంగా 11,335 హెక్టార్లల్లో విస్తరించి ఉంది. జీడిమామిడి సాగులో టీ దోమ అక్టోబరు నుంచి ఏప్రిల్ నెలల్లో అక్కడక్కడా కనిపిస్తుంది. ఈ టీ దోమ పూతదశ నుంచి పంట చేతికందే వరకూ కనిపిస్తుంది. లేత ఆకులు, పూతలు మాడిపోతాయి. పక్వానికి రాని గింజలు ముందుగానే రాలిపోతాయి. గింజలపై మచ్చలు చారలు ఏర్పడి నాసిరకంగా తయారవుతయాయి. ఈ టీదోమ ప్రభావం కారణంగా చెట్టు పాలిపోయినట్లుగా కనిపిస్తుంది. ఈ దోమ చిరు దశలోను తల్లిదశలోనూ లేత కొమ్మలు పైన రెమ్మలు పైన వాలి వాటి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురులాంటి పదార్థం కారుతూ నల్లని చారలు ఏర్పడతాయి. ఇలా టీ దోమ తోటల్లో గుర్తించవచ్చని అధికారులు చెబుతున్నారు.

మూడు దశల్లో సస్యరక్షణ చర్యలు

టీ దోమ నివారణకు మూడు దశల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మొదటిది చిగురాకు దశ, ఈ దశ అక్టోబరు నుంచి నవంబరు నెలల్లో కనిపిస్తుంది. రెండవది పూత దశ ఇది డిసెంబరు నుంచి జనవరి నెలల్లో కనిపిస్తుంది. మూడోది గింజకట్టే దశ. ఇది ఫిబ్రవరి నుంచి మార్చి నెలల్లో కనిపిస్తుంది. ఈ మూడు దశల్లోనూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖాధికారులు సూచిస్తున్నారు.

నివారణ ఇలా...

జీడిమామిడి తోటల్లో పూతదశ ప్రారంభమయ్యింది. పూతదశలోనే తేయాకు దోమ (టీ దోమ)ను అధికారులు గుర్తించారు. ఈ దశలోనే దీనిని నియంత్రించాలని అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారు. టీ దోమ నివారణకు ఎల్..సైహాలోత్రిన్, ఎసిటామిప్రిడ్ థయామీ థాక్సమ్ మందులను తగు మోతాదులో పిచికారీ చేసుకోవాలి, లేదా ప్రొఫినోఫాస్ 1 మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవచ్చని ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


జీడిమామిడి తోటల్లో తేయాకు దోమ (టీ దోమ)ను గుర్తించడం జరిగింది.. దీనికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ముందుగా గుర్తిస్తే నష్టాన్ని చాలావరకూ నివారించుకోవచ్చు. టీ దోమ జీవిత చక్రం 20 నుంచి 30 రోజుల్లో ఆగిపోతుంది. జీడిమామిడి చెట్టు చుట్టూ పళ్లాలు చేసి కలుపులేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా జనవరి నెలలో దీని ఉధృతి అధికంగా ఉంటుంది. ఇప్పటికే అప్రమత్తమయ్యాం. దీనిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం.

- నూనె సుజాత,
ఉద్యానశాఖాధికారిణి, పెద్దాపురం

20న అయోధ్యకు సూపర్‌లగ్జరీ బస్సు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 15: ఈనెల 20న కాకినాడ డిపో నుంచి అయోధ్యకు సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. కాకినాడలో బయలుదేరి పూరి, కోణార్క్, భువనేశ్వర్, సాక్షిగోపాలం, జాజిపుర్, గయ, వారణాసి, ప్రయాగ్‌రాజ్, అయోధ్య, నైమిశారణ్యం, సీతామఢి క్షేత్రాలను చూపించి తిరిగి 30న కాకినాడ చేరుకుంటుందన్నారు. బస్సుకు టిక్కెట్ రూ.12,000 ధర నిర్ణయించారన్నారు. ఉదయం పలహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం కల్పించామన్నారు. వివరాలకు 7382910869, 7382910778 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ మృతి



కరప, మార్చి 15: ఉమ్మడి రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ విప్పర్తి నాగరాజు బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా కరపలోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తోటలో డాక్టర్‌గా సుపరిచితులైన నాగరాజు వైద్యవృత్తిలో సుదీర్ఘకాలం పనిచేశారు. రంగంపేట, నగరం, సోంపేట, ఇందుకూరుపేట, దుగ్గుదూరు, అమలాపురం, కాకినాడ ఏపీఎస్పీ, పెదపూడి, తదితర పీహెచ్‌సీలలో వైద్యాధికారిగా పనిచేశారు. ఆ తరువాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా, విశాఖపట్నం జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వోగా, శ్రీకాకుళం జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి 2000లో పదవీవిరమణ చేశారు. రిటైర్ అయిన తరువాత కూడా నిర్విరామంగా పేదప్రజలకు వైద్యసేవలందించారు. ఆయన మరణవార్త విని పలువురు శోకసముద్రంలో మునిగిపోయారు. నాగరాజు కుమారుడు, ఎస్తేర్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విప్పర్తి సుదర్శన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్తేర్ కాంపౌండ్‌లో శుక్రవారం ఆదరణ కూడిక నిర్వహించారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు విచ్చేసి నివాళులర్పించారు.

చెందుర్తిలో మహిళ దారుణహత్య



హత్యకు గురైన కుమారి

గొల్లప్రోలురూరల్, మార్చి 15: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తిలో మహిళ దారుణహత్యకు గురైంది. సహజీవనం చేస్తున్న వ్యక్తే ఈ సంఘటనకు పాల్పడినట్టు చెబుతున్నారు. చెందుర్తి గ్రామానికి చెందిన అయినవిల్లి కుమారి (48) రెండు దశాబ్దాల కిందట భర్తతో విడిపోయింది. అప్పటి నుంచి అదే గ్రామానికి చెందిన తాటిపర్తి కనకలింగేశ్వరరావుతో సహజీవనం సాగిస్తోంది. కొంతకాలంగా కుమారి వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే విషయంలో కనకలింగేశ్వరరావుతో ఘర్షణ జరుగుతోంది. గురువారం అర్ధరాత్రి ఇదే విషయంపై గొడవ జరిగింది. దీంతో మడత మంచం పట్టితో కుమారిని కొట్టి కనకలింగేశ్వరరావు హతమార్చాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యువతిని మోసగించిన కేసులో

నిందితుడికి పదకొండేళ్లు జైలు

కాట్రేనికోన, మార్చి 15: యువతిని మోసగించిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి న్యాయస్థానం 11 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఎస్ఐ ఎస్. నాగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు గుత్తుల వెంకటకిరణ్ బంటుమిల్లికి చెందిన ఒక యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచనకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 2020 మే 27న అప్పటి ఎస్ఐ సంపత్‌కుమార్ కేసు నమోదుచేశారు. కోర్టులో వాదప్రతివాదాల అనంతరం నేరం రుజువుకావడంతో జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు ముద్దాయికి 11 సంవత్సరాలు జైలు, రూ. 5,000 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదించారు.





బోల్తాపడిన ఆటో.. (పక్కన) గాయపడ్డ విద్యార్థులను తరలిస్తున్న దృశ్యం

ఆటో బోల్తా.. పలువురు విద్యార్థులకు గాయాలు

ఎటపాక, మార్చి 15: పాఠశాలకు విద్యార్థులతో వెళ్తున్న ఆటోకు వానరాలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి విద్యార్థుల ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటన శుక్రవారం గుండాల-రాయనపేట మధ్యలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రాయనపేట, వెంకటరెడ్డిపేట గ్రామాలకు చెందిన కొందరు విద్యార్థులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే విద్యార్థులు ఆటోలో పాఠశాలకు వెళ్తున్నారు. అయితే గుండాల- రాయనపేట మధ్యలో కల్వర్టు సమీపంలో వానరాలు ఒక్కసారిగా అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని వేరే ఆటోలో చికిత్స కోసం భద్రాచలానికి తరలించి వైద్య చికిత్స అందించారు.



జాతీయ రహదారిపై వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందిన రాంబాబు

గూడ్స్ వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాజానగరం, మార్చి 15: రాజానగరం జాతీయ రహదారిపై నరేంద్రపురం జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం గూడ్స్ వాహనం ఢీకొని ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. మృతుడు గొల్లప్రోలుకు చెందిన దూది రాంబాబు (42)గా పోలీసులు గుర్తించారు. రాంబాబు గొల్లప్రోలు నుంచి మోటార్‌సైకిల్‌పై కోరుకొండ మండలం దోసకాయలపల్లిలోని కుమార్తె ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రాజానగరం-నరేంద్రపురం జంక్షన్‌లో రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గూడ్స్ వాహనం మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో రాంబాబు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాంబాబు హోటల్‌లో పనిచేస్తుంటాడు. ఈ మేరకు ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

పీడీఎస్ బియ్యం లారీపై విజిలెన్స్ దాడులు

సామర్లకోట, మార్చి 15: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారున కాకినాడకు భారీ లారీలో అక్రమంగా తరలివెళుతున్న పీడీఎస్ (రేషన్) బియ్యం రవాణాపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించి రూ.9 లక్షల 98 వేల 243 విలువైన 4,357 కిలోల రేషన్ బియ్యాన్ని 94 మూటలలో రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులకు ముందుగా అందిన సమాచారం మేరకు టీఎస్ 28 టీబీ 3127 నంబరు గల అశోక్‌లేలాండ్ లారీని ఆపి సోదాచేయగా పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం మండలంలోని మెదరబస్తి గ్రామానికి చెందిన వాహన యజమాని ఏ.పవన్, డ్రైవర్లు చందు, పి.సాయిభరత్‌ల ద్వారా పాల్వంచ నుంచి కాకినాడకు లారీలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సోదాలు చేయడంతో అక్రమ రవాణా బహిర్గతమయ్యింది. రేషన్ బియ్యంగా నిర్ధారించి సదరు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సామర్లకోట ఎంఎస్వో కీర్తికి విజిలెన్స్ అధికారులు స్వాధీనపర్చారు. 6ఏ కింద కేసు నమోదు చేసి వాహనాన్ని సామర్లకోట పోలీసులకు అప్పగించారు. లారీ యజమాని, ఇద్దరు డ్రైవర్లపైనా క్రిమినల్ చర్యల నిమిత్తం తదుపరి దర్యాప్తు చేస్తున్నట్టు విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, లక్ష్మీనారాయణ, సీఎస్ డీటీ కీర్తి, విజయకుమారి, జీవానందంలు తెలిపారు.

ఏజెన్సీ సమాచారం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే.. పీహెచ్‌సీల తనిఖీ

వై.రామవరం, మార్చి15: ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలపై వచ్చిన రోగులకు వెంటవెంటనే వైద్య పరీక్షలు జరిపి వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని చవిటిదిబ్బలు, అడ్డతీగల మండలం దుప్పులపాలెం, రంపచోడవరం మండలం వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయాచోట్ల రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, గర్భిణీల సంఖ్య, డెలివరీలు, ప్రమాదకర గర్భిణీలను గుర్తించే విధానాలపై ఆరా తీసి సూచనలు చేశారు. మందులు అందుబాటులో పెట్టుకోవాలని పీవో సూచించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. గోకులం పథకం ద్వారా కుసుమరాయి, తుంగమడుగుల గ్రామాల్లో నిర్మిస్తున్న పశువుల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. రూ.22 లక్షలతో నిర్మిస్తున్న ఒక్కో షెడ్‌లో 20 గేదెలు ఉండేలా నిర్మాణాలను చేపట్టాలని, పనులు వేగవంతంగా చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమశాఖ ఈఈ జి.డేవిడ్‌రాజు, డీఈ నాగరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

వై.రామవరం,మార్చి15: వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రంలో ఈనెల 1 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ప్రధాన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆఖరి రోజు నిర్వహించిన పరీక్షలకు 109 మంది హాజరుకావలసి ఉండగా 107 మంది పరీక్షలు రాసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ ప్రిన్సిపాల్ ఈశ్వర కృప తెలిపారు. ఒకేషనల్ పరీక్షలు నిర్వహించాల్సి ఉందని, ఈ కేంద్రంలో వై.రామవరం, పి.యర్రగొండ, తోటకూరపాలెం కేజీబీవీల నుంచి విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. ఈ కార్యక్రమంలో డీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లారీ ఓనర్ల దీక్ష విరమణ

చింతూరు, మార్చి 15: లారీ ఓనర్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం విరమించారు. స్థానిక డిపో నుంచి విక్రయదారులకు కలప తరలించేందుకుగాను స్థానిక లారీలనే వినియోగించాలని, దీనిపై స్థానిక లారీ ఓనర్లకు, సిబ్బందికి ఉపాధి కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో 12 రోజులపాటు కలప డిపో వద్ద దీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో డిపో రేంజి అధికారి కొండలరావు, డీఆర్వో శివ శంకర్ బృందంతో బీజేపీ మండల అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అహ్మద్ అలి సమక్షంలో లారీ ఓనర్లు చేపట్టిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించారు. ఈ నిరాహార దీక్షల కార్యక్రమంలో లారీల యజమానులు బాలాజీ, కె.మహిలింగం, నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ని నిషేధిద్దాం... ర్యాలీ, అవగాహన సదస్సు

చింతూరు, మార్చి 15 : ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిద్దామని పేగ పంచాయతీ పరిధిలోని యువత ఆధ్వర్యంలో శుక్రవారం ఏడుగురాళ్ళపల్లి వారాంతపు సంతలో ర్యాలీ, అవగాహన నిర్వహించారు. దుకాణదారులు ప్లాస్టిక్ కవర్ల స్థానంలో పేపరు సంచులు వినియోగంలోకి తీసుకరావాలని కోరారు. ఈ సందర్భంగా ఆరు వేల ప్లాస్టిక్ సంచులను స్వాధీనపర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడుగురాళ్లపల్లి సర్పంచ్ సవలం సత్తిబాబు, ఉప ఎంపీపీ ఎడమ అర్జున్‌లు మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించడం జరిగిందని, వచ్చేవారం నుంచి ఏ ఒక్క దుకాణదారుడైన ప్లాస్టిక్ సంచిని వినియోగించిన పక్షంలో ఆ దుకాణదారుడికి రూ.6 వేల జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ నిషేధిత నిర్వహణ కమిటీ ప్రతినిధులు సుబ్బరాజు, తోడం చంద్రయ్య, పెద్ద చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



జనసేన మండల కమిటీ కార్యవర్గం, కమిటీ సభ్యులు

జనసేన మండల కమిటీ ఏర్పాటు

చింతూరు, మార్చి 15 : జనసేన మండల కమిటీ ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నికైంది. నూతన కమిటీలో భాగంగా ఇప్పటివరకు మండల అధ్యక్షునిగా పనిచేస్తున్న మడవిరాజును కొనసాగిస్తూ ఏకగ్రీవ నిర్ణయం జరిగింది. తాజా కమిటీలో ఉపాధ్యక్షులుగా తీగల రవి, చిలకం కన్నారావు, పెరుమాళ్ళ శివ, మండల ప్రధాన కార్యదర్శులుగా ఉయిక వెంకటేష్, కారం దుర్గారావు, మిడియం రమణమ్మ, మండల కార్యదర్శులుగా పయ్యాల నాగేశ్వరరావు, కులుముల రమణారావు, దోమల భగవత్, మండల వీర మహిళగా తీగల కవితతోపాటు సంయుక్త కార్యదర్శులుగా మరో 18 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు మడివిరాజు అధ్యక్షత వహించగా తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కాకి స్వామి, దేవీపట్నం మండల అధ్యక్షుడు సారపు వెంకటరాయుడు, రంపచోడవరం ఉపాధ్యక్షుడు సురేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బియ్యం సకాలంలో అందించాలి : పీవో

రంపచోడవరం, మార్చి15: ఏజెన్సీలో తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సకాలంలో పంపిణీ చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాలులో ఆయన గిరిజన సంక్షేమశాఖ, జీసీసీ, డివిజనల్ సప్లయి, విద్యాశాఖల అధికారులు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గ్రామంలో తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఎండీయూ వాహనదారులు రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించారు. రేషన్ సరఫరా నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ కె.అబుసలాం, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, డివిజనల్ సివిల్ సప్లయి అధికారి శ్రీహరి, డీఈవో మల్లేశ్వరరావు, తహశీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, ఏపీ రమణ, ఏటీడబ్ల్యూవో రామతులసి, జీసీసీ ఎస్ఎం నాగ మూర్ల వెంకట రాజారెడ్డి, సీడీపీవో సంధ్యారాణి, డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో పాట్లు



మోతుగూడెం, మార్చి15: చింతూరు మండలం మోతుగూడెం చింతూరు డొంకరాయి బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్సైంజ్‌ల పరిధిలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఏడెనిమిది నెలలుగా ఇక్కట్లు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఏదైనా సాంకేతిక లోపం వచ్చినప్పుడు సంబంధిత సిబ్బంది సకాలంలో హాజరుకాని దుస్థితి నెలకొంది. నెలలో సగం రోజులు బీఎస్ఎన్ఎల్ సేవలు పూర్తిగా నిలిచిపోవడం, వినియోగదారులు ఇబ్బందులు పడడం షరా మామూలైపోయింది. దీంతో ఇతర ఆపరేటర్లు వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేసుకుంటున్నారు. బీఎస్ఎన్ఎల్ సేవలు తరచూ ఆగిపోవడంవల్ల ఇప్పటికే చాలామంది వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌ల వైపు మారిపోయారు. గతంలో బీఎస్ఎన్ఎల్ ఎక్కువ ఖర్చులు చేసి తక్కువ రాబడిని ఆర్జించేది. దీంతో నష్టాలు చవిచూసేది. ఇప్పుడు తక్కువ ఖర్చుపెట్టి ఎక్కువ రాబడి వచ్చే సిస్టం వచ్చినా వినియోగదారుల్ని నిలబెట్టుకోలేని పరిస్థితికి బీఎస్ఎన్ఎల్ చేరింది. ఇప్పటికైనా నెట్‌వర్క్ లోపాలపై దృష్టి పెట్టాల్సి ఉంది.

ఇంటింట ప్రచారాన్ని వేగవంతం చేయాలి

» రామకృష్ణారెడ్డి.. బలభద్రపురంలో టీడీపీలోకి చేరికలు

బిక్కవోలు, మార్చి 15: ఎన్నికలు దగ్గరవుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇంటింటా ప్రచారం చేయాలని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బలభద్రపురంలో శుక్రవారం మండల టీడీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టో, జనసేన, బీజేపీతో టీడీపీ ఎందుకు కలసి ఎన్నికలకు వెళ్తుందో ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వైసీపీకి చెందిన మల్లిడి కనకప్రసాద్‌రెడ్డి, తేతలి సుబ్బారెడ్డి, దర్శి సత్యానందం ఆధ్వర్యంలో 20 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి రామకృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో చంద్రబాబు నిర్వహించబోయే ప్రజాగళం సభకు బలభద్రపురంలో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్ఎస్.పేట రైల్వే వ్యాగన్ డైలీ లేబర్ కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, మల్లిడి అబ్బాయిరెడ్డి, రేలంగి నాగేశ్వరరావు, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవానందరెడ్డి పాల్గొన్నారు. కాగా ఆర్ఎస్ పేటలో యువనేత నల్లమిల్లి మనోజ్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర భవిష్యత్తు టీడీపీ, జనసేన, బీజేపీతోనే సాధ్యమని వివరించారు. ఆయన వెంట పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, గొర్రెల త్రిమూర్తులు, మాడా మోహన్, బోను సూర్యకుమార్ తదితరులున్నారు.



బలభద్రపురంలో టీడీపీలో చేరిన కార్యకర్తలతో రామకృష్ణారెడ్డి



రాజమహేంద్రవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి వాసు

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలి : వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15: జగన్‌ను నమ్మి మోస పోయిన ప్రజలందరు 2024 ఎన్నికల్లో భావితరాల భవిష్యత్తుకోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక 4వ డివిజన్‌లో తాడేపల్లి గూడెం టీడీపీ పరిశీలకుడు నక్కా చిట్టిబాబు ఆధ్వర్యంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్ పర్యవేక్షణలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఆదిరెడ్డి వాసు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనసూరి ప్రసాద్, అనసూరి శ్రీను మరికొంత మందికి పార్టీ కండువాలు కప్పుకుని టీడీపీలో చేరారు.ఈ కార్యక్రమంలో బండారు శ్రీను, కొండిశెట్టి రామకృష్ణ, బొట్టా వీరబాబు, దారా రాజు, మొతికి మురళీకృష్ణ, గుత్తుల రమేష్, వెల్లంకి మణికంఠ, కర్రి మహేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ అత్యవసర సమావేశం

అనపర్తి, మార్చి 15: టీడీపీ అనపర్తి నియోజకవర్గ కార్యకర్తల అత్యవసర సమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నట్టు జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియెట్ పరీక్షలు

రంగంపేట, మార్చి 15: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిసాయని చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. శుక్రవారం ఇంటర్ సెకండియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 467 మంది విద్యార్థులకుగాను 437 మంది హాజరయ్యారన్నారు. డీవోలుగా కేవీ సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్ వ్యవహరించారని, ఫ్లయింగ్ స్క్వాడ్ వి.వందనలక్ష్మీ, సిట్టింగ్ స్క్వాడ్‌లు ఎన్.విజయ్‌కుమార్, కె.ఉమాశంకర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారని హేమ తెలిపారు.

బంతి సాగు లాభదాయకం

ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు



పూలతోటలను పరిశీలిస్తున్న నరసింహారావు

దివాన్ చెరువు, మార్చి 15: జిల్లాలోని రాజానగరం, కడియం ప్రాంతాలలో సార్వా వరి తరువాత బంతి సాగు వల్ల రైతులకు లాభం చేకూరుతుందని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్‌తో కలసి వెలుగుబంద, వెంగాయమ్మపేట, కడియపుసావరం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి వరి తరువాత పూలమొక్కలు సాగుచేసే రైతులను కలిసి పలు సూచనలు చేశానని ఒక ప్రకటనలో తెలిపారు. మార్టేరు పరిశోధనా స్థానంలో పరిశోధనా ఫలితాలను రైతుల కమతాల్లో పరీక్ష చేసే ప్రక్రియలో భాగంగా కడియపుసావరం, వడిశలేరు ప్రాంతాల్లో సార్వా వరి తరువాత వివిధ పంటలైన మినుము, మొక్కజొన్న బంతిసాగులను పరిశీలించామన్నారు. వీటిలో బంతిసాగు చేపట్టిన రైతులకు లాభాలు ఎక్కువగా చేకూరడం గమనించామని తెలిపారు. రైతు ఎస్.సత్తిరాజు కమతంలో పంట ఆర్థిక స్థితిగతులను పరిశీలించామని, బాగా లాభాలు ఆర్జిస్తున్నారని చెప్పారు. సార్వా వరి నవంబరులో కోతకోయగానే బంతి నారు ఊడ్చారన్నారు. వాటి నుంచి పూలు కోతకు వస్తున్నాయని నిత్యం పూలమార్కెట్‌కు అమ్మి ఆదాయం పొందుతున్నారని తెలిపారు. అంతేగాక బంతిని వరికోత తర్వాత ఒకేసారి కాకుండా 15 రోజుల వ్యవధిలో పలుమార్లు నాటితే నిరాటంకంగా పూలు ఉత్పత్తి జరుగుతుందన్నారు. వివాహాది శుభ కార్యక్రమాలకు డిమాండ్‌ను బట్టి సరఫరా చేసి ఆదాయం పొందవచ్చునని చెప్పారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా డైరెక్టర్‌గా నాగమణి



గోకవరం, మార్చి 15: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డైరెక్టర్‌గా ప్రగల్లపాటి నాగమణి నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన విజయవాడలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ రెడ్డి సమక్షంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో పాటు తమ్మన భాస్కర్‌కుమార్, గుంట శ్రీనివాస్, మాచారం నాగమణి, భారతి, నూకల మల్లికార్జునరావు, గునిశెట్టి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ కనకరాజు, హారిక, ప్రవల్లిక, సంతోష్ గుప్త, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ త్రినాథరావు అభినందించారు.

బిజినెస్ సొల్యూషన్స్‌తో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం



బిజినెస్ సొల్యూషన్స్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 15: ముంబయిలోని ఐడీఏ బిజినెస్ సొల్యూషన్స్‌తో భాగస్వామ్యమయ్యేలా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంది. రసాయనశాస్త్ర విభాగంలో జడ్ స్పేస్ ఇన్‌స్పైర్ ప్రొలాప్టాప్ స్టేషన్‌ను స్థాపించడానికి అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా కళాశాల బోధన, అభ్యసన వాతావరణంలో జడ్‌స్పేస్, వర్క్ స్టేషన్లను వినియోగించుకుని డిజిటల్ విద్య దిశగా అభివృద్ధిని సాధించవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. జడ్ స్పేస్ తరపున సచిన్ మహేందు మాట్లాడుతూ మిక్స్‌డ్, రియాలిటీ, ఏఆర్, వీఆర్‌ల ద్వారా విద్యార్థుల అభ్యసన అనుభవాలను జడ్ స్పేస్ శక్తివంతం చేస్తుందన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నైపుణ్య సెంటర్ కో ఆర్డినేటర్ వెంకటరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, అకడమిక్ కో ఆర్డినేటర్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే వినియోగదారుల హక్కుల పరిరక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 15: చైతన్యంతోనే వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోగలమని రాజమహేంద్రవరం జీఎస్‌కేఎం లా కళాశాల సీనియర్ అధ్యాపకుడు పి.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం శుక్రవారం నటరాజ్ రైతుబజార్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.మధుసూధనరావు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి వెంకటేశ్వరరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎన్‌డీఏ కూటమి తొలి బహిరంగ సభ

కొవ్వూరు, మార్చి 15: ఈ నెల 17న పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలో జరగనున్న ఎన్‌డీఏకూటమి తొలి బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కొవ్వూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని మళ్లీ నిలబెట్టడానికి కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు అవసరమన్నారు. ప్రధాని మోదీ పాల్గొనే ఈ సభ రాష్ట్రంలో నవశకానికి పడుతున్న తొలి అడుగన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

కోరుకొండ, మార్చి 15: నియోజకవర్గంలోని అర్హులైన 1286 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. మండలంలో జంబుపట్నంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలోని 20,178 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ వుల్లి సూర్యకుమారి, సర్పంచ్ వుల్లి అప్పన్నదొర, నాగా సత్తిబాబు, వుల్లి చల్లారావు పాల్గొన్నారు. కోటి గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్లకు జక్కంపూడి విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. అలాగే కోటికేశవరంలో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్‌నును ఎమ్మెల్యే జక్కంపూడి ప్రారంభించారు. ఇప్పటికే రాజానగరం, శ్రీరంగపట్నం గ్రామాల్లో నిర్మించిన మల్టీపర్పస్ గొడౌన్లను ప్రారంభించామన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత.. నియోజకవర్గంలోని 41 మందికి సీఎం సహాయ నిధి నుంచి రూ.15.16 లక్షల నిధులు విడుదలయ్యాయి. ఈ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే జక్కంపూడి సతీమణి జక్కంపూడి రాజశ్రీ లబ్ధిదారులకు అందజేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 1153 మందికి రూ.9.53 కోట్లు ఆర్థిక సాయం అందజేసినట్టు చెప్పారు.

చేపల మార్కెట్‌లో వ్యాపారుల ధర్నా

కేటాయింపులు లాటరీ విధానంలో వద్దంటూ నినాదాలు



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చేపల వర్తక సంఘం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15: రాజమహేంద్రవరం జాంపేట చేపల మార్కెట్‌లో కేటాయింపులు పాత విధానంలోనే చేయాలని లాటరీ విధానం వద్దని డిమాండ్ చేస్తూ హోల్‌సేల్ అండ్ రిటైల్ చేపల వర్తక సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. మార్కెట్‌లో జాగాలను లాటరీ విధానంలో కేటాయింపులు చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని దానిని వ్యతిరేకిస్తూ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం చేపల వర్తకులు ధర్నా చేశారు. సంఘం అధ్యక్షుడు అక్కల కోటేశ్వరరావు, మునిరి నాగు, ఎడ్ల రమేష్, వాసుపల్లి నారాయణ, కూరం అప్పారావు, చిట్టిమేని ఎల్లయ్యలు మాట్లాడారు. చేపల మార్కెట్‌లో జాగాల కేటాయింపులు పాత పద్ధతిలోనే చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అక్కల సత్యవతి, నక్కా నాగమ్మ, గొల్ల అచ్చియమ్మ , దేవరపల్లి పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుకొండ, మార్చి 15: నాసా సంస్థ జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ అనలిటికల్ అప్టిట్యూట్ టెస్ట్‌లో తమ విద్యార్థులు ఏడుగురు ప్రతిభ కనబరిచినట్టు కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ అను తెలిపారు. విద్యార్థులు గుగ్గిలం భార్గవి, వీఎస్‌పి ఫణీంద్ర, ఎం.వేద్రశ్రీ, షేక్ రషీద్, కోన సత్య శివమహేంద్ర, సత్యం యశస్విని నాగదుర్గ, చల్లపల్లి గౌతమ్ వర్ధన్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను శుక్రవారం పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెనకటి గంగాధరరావు, హెచ్ఎం ప్రభావతి పాల్గొన్నారు.

'కోనేరు' సిఫార్సులు అమలు చేయాలి

ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారుడు అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15: కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినా పురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోనేరు రంగారావు సిఫార్సుల్లో ప్రతి పేద కుటుంబానికి కనీసం ఎకరం భూమి ఇచ్చేందుకు పరిపడా భూములు రాష్ట్రంలో ఉన్నాయని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని చెప్పారు. సిఫార్సుల్లో సగానికి పైగా షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధికి సంబంధించి ఉన్నాయన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులన్నీ కచ్చితంగా అమలు చేయాల్సిందేనన్నారు. రంపచోడవరం కేంద్రంగా తొలితరం గిరిజన వీరుడు కారం తమ్మన్నదొర జిల్లా ప్రకటించాలన్నారు. నకిలీ గిరిజన సర్టిఫికెట్లతో చెలామణీ అవుతున్న అనంత ఉదయభాస్కర్, కొత్తపల్లిగీత లాంటి వ్యక్తులకు ఎమ్మెల్సీ, ఎంపీ పదవీలను కట్టబెట్టి గిరిజనుల ప్రయోజనాలకు రాజకీయ పార్టీలు భంగం కలిగిస్తున్నాయన్నారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ ప్రతినిధులు అరగంటి వీరభద్రారెడ్డి, కెచ్చెల అబ్బాయిరెడ్డి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు మిడియం వెంకటస్వామి, మడకం బంగారు బాబు, తెల్లం శేఖర్, మామిడి చిన్నారెడ్డి, కడబాల బేబి కుమారి పాల్గొన్నారు.

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి

నల్లజర్ల, మార్చి 15: ప్రతి గర్భిణి, బాలింత పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని ఐసీడీఎస్ గోపాలపురం సీడీపీవో బాల త్రిపురసుందరి అన్నారు. శుక్రవారం పోతవరం -49లో బాలింతలకు, గర్భిణులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఒంటరి మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

అనపర్తి, మార్చి 15: కుమార్తెతో కలిసి జీవిస్తున్న ఓ మహిళను తన కోరిక తీర్చాలంటూ వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలోని ఒక గ్రామంలో భర్త ఇతర రాష్ట్రానికి పనికి వెళ్లడంతో మహిళ తన కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తోంది. ఆమెను రామవరం గ్రామానికి చెందిన ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి కొద్దిరోజులుగా తన కోరిక తీర్చమని వేధిస్తున్నాడు. ఈనెల 10వ తేదీ రాత్రి ఆమె ఇంటికి వెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. అడ్డు వచ్చిన ఆమె కుమార్తెపై కూడా దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించడంతో నాలుగు రోజులుగా ఇంటిలోనే ఉండిపోయింది. శుక్రవారం పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సాంకేతికత ఆవశ్యకత ఎంతో పెరిగింది

దివాన్‌చెరువు, మార్చి15: నేటి ఆధునిక కాలంలో సాంకేతికత ఆవశ్యకత ఎంతో పెరిగిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ అంశాలపై ఎస్ఆర్‌టీ టెక్ ఐకాన్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలు అందరికీ అవసరమన్నారు. సంస్థ సీఈవో ఎస్‌వీడీ రవితేజ, వెంకట భమిడిపాటిలు శిక్షణా అంశాలను వివరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ టి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

'పొట్టి శ్రీరాములుకు భారతరత్న ప్రకటించాలి'

దివాన్‌చెరువు, మార్చి 15: అమరజీవి పొట్టిశ్రీరాములుకి భారతరత్నను తక్షణం ప్రకటించాలని అమరజీవి పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు గ్రంధి నానబ్బులు కేంద్ర ప్రభుత్వానికి శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శనివారం శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాములు ప్రాణత్యాగానికి నిదర్శనంగా 58అడుగుల కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర రాజధాని అమరావతిలో గాని, విజయవాడలో గాని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. గన్నవరంలోని విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని, ఈ విషయమై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాలన్నారు. 2026 మార్చి 26న వచ్చే పొట్టిశ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా దేశ పండుగలా నిర్వహించాలని నానబ్బు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

జీజీయూలో ఎన్‌సీసీ షూటింగ్ కాంపిటేషన్



రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రాజానగరం, మార్చి 15: కాకినాడ గ్రూప్ ఎన్‌సీసీ-18 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో అంతర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ కాంపిటేషన్ (ఐటీఎస్ఎస్‌పీ)ట్రయల్ నెంబర్-1 ఫైరింగ్ ప్రాక్టీస్ గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. కమాండర్ కల్నల్ సావన్ గౌడర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సుబేదార్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఆంధ్ర బెటాలియన్, 3 ఆంధ్ర బాలికల బెటాలియన్, 9 ఎయిర్ స్క్వాడ్రెన్ క్యాడెట్స్ నుంచి 103 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరైనట్టు చెప్పారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు జాతీయస్థాయి ఎన్‌సీసీ షూటింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, డీన్ టి.జయానందకుమార్, ఎన్‌సీసీఎఎన్ ఓఏ తేజోశ్వరరాజు, 18 ఆంధ్రా ఎన్‌సీసీపీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోనగూడెంలో ముగిసిన వైద్య శిబిరం

రాజానగరం, మార్చి 15: జీఎస్ఎల్ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని తూర్పుగోనగూడెంలో వారం రోజులుగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరం శుక్రవారం ముగిసింది. దీనిలో భాగంగా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 60 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే స్థానిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గల్లా సత్యశ్రీ, నాయకులు గల్లా రంగారావు, పీవో ప్రొఫెసర్ బి.గీతాప్రవీణ, ఏపీవో మాలిని పాల్గొన్నారు.

రంగంపేటలో గ్లకోమాపై అవగాహన సదస్సు



రంగంపేటలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట, మార్చి, 15: ప్రపంచ గ్లకోమా నివారణా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రంగంపేటలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో గ్లకోమాపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. కంటి వైద్యురాలు ఎం.ఇందిర మాట్లాడుతూ గ్లకోమా వల్ల కంటి లోపల పీడనం పెరిగి నరాలు చచ్చుబడిపోయేటట్టు చేస్తుందని, తద్వారా నెమ్మదిగా కంటిచూపు తగ్గిపోతుందన్నారు. 35-40 ఏళ్ల వయసున్న వారికి ఈ వ్యాధి రావచ్చని, సకాలంలో శస్త్రచికిత్స చేయించుకుంటే దాని నుంచి బయట పడొచ్చని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌వో జయమణి, ఎంపీహెచ్ఈవో ప్రసాద్, పి.రాజేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో గ్లకోమాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కృషి, పట్టుదలతో చదవాలి

రంగంపేట, మార్చి 15: విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆంగ్ల ఉపాధ్యాయుడు మునుక్టుల శివరామకృష్ణ శర్మ సూచించారు. శుక్రవారం చంద్రేడు జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం గంటా రమణబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పదో తరగతి విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు ఎలా రాయాలో వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: భీమా
సూర్యామినీ	: బస్తర్, యోధ
సూర్యాప్యాలస్	: కుంపూ పాండా-4
స్వామి	: వెయ్ దరువెయ్
శివజ్యోతి	: హనుమాన్
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమలు
రాజా	: రజాకార్
ఊర్వశి	: రజాకార్
రంభ	: తంత్ర
మేనక	: లంబసింగి, షరతులు వర్తిస్తాయి
అప్సర	: గామి
కుమారి	: మాయ, ప్రేమలు
వీఎస్ మహాల్(నామవరం)	: రజాకార్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ప్రేమలు
వెంకటసూర్య(కడియం)	: భీమా
సత్యగౌరి (అనపర్తి)	: భీమా
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ప్రేమలు
రామకృష్ణ(కోరుకొండ)	: భీమా
గీతాసినిమాస్ (సీతానగరం)	: భీమా
శ్రీనివాస (గోకవరం)	: భీమా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహాల్(రంపచోడవరం)	: భీమా
నవయుగ(చింతూరు)	: వెయ్ దరువెయ్

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శని) సా.6.22
సహరి (ఆది) ఉ.4.49

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	37.0	23.0

నేడు మోగనున్న నగారా

- నేడే ఎన్నికల షెడ్యూల్ విడుదల
- 3 గంటల నుంచి కోడ్ అమలు
- ప్రలోభాలకు తెరలేపిన వైసీపీ
- ఆవ భూముల పట్టాలు పంపిణీ

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల మూడ్‌లోకి పూర్తిగా వెళ్లిపోయే సమయం ఆసన్నమైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ వచ్చేస్తోంది.కేంద్ర ఎన్నికల సంఘం శనివారం సాయంత్రం 3 గంటలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనుంది. షెడ్యూల్ జారీ అయినప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుం ది. ఇక ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు ఉండవు.. రాజకీయ నాయకుల పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు అన్ని తొలగించాల్సి ఉంటుంది. కొత్త పథకాలు ప్రారంభం కాని, అభివృద్ధి పనుల ప్రారం భం కాని ఉండవు. షెడ్యూల్ ప్రకటన తరువాత నోటిఫికేషన్ జారీ అవుతుంది. షెడ్యూల్ ప్రకటన రానుండడంతో జిల్లా రాజకీయ పార్టీల్లో ఉత్సాహం పెరిగింది. ఇప్పటికే టీడీపీ, జనసేన అసెంబ్లీ అభ్యర్థుల అందరూ ఖరారైన సంగతి తెలిసిందే. వైసీపీ మొ త్తం అన్ని నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను శనివారం అధికారికంగా ప్రకటించనుంది.ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి ప్రకటన రేపో మాపో రానున్నది.టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్ప డిన తరువాత లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించినట్టు తెలిసిందే. శనివారం సాయంత్రానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఇప్పటికే ఖరారైన అభ్యర్థులతో పాటు టిక్కెట్లను ఆశించేవారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులు ఒక ప్రణాళికాబద్ధంగా ప్రచారం ఆరంభించారు. తమ మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికి ప్రచారం చేస్తున్నారు.

స్థలం చూపకుండానే.. ఇళ్ల పట్టాలు..

ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోపు ఉన్న ప్రతి క్షణాన్ని ప్రలోభా లకు వినియోగించుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తుంది. ఇప్పటికే వైసీపీ అభ్య ర్థులు చీరలు, రకరకాల వస్తువులతో ప్రలోభాలకు తెరలేపారు. నేటి మధ్యా హ్నం 3 గంటల వరకూ అవకాశం ఉండడంతో మరింత రెచ్చిపోతారు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో సుమారు నాలుగేళ్ల కిందట ఆవ భూ ముల్లో ఇళ్లపట్టాలు ఇవ్వడానికి హామీపత్రాలు ఇచ్చిన లబ్ధిదారులకు 2 రోజుల నుంచి హడావుడిగా పట్టాలు పంపిణీ చేస్తున్నారు. కొంత మంది లబ్ధిదారులకు అసలు భూములు చూపించకుండా, మరికొందరికి అసలు భూమి లేకుండానే పట్టాలు ఇచ్చేయడం గమనార్హం. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లో కూడా ఇదే తతంగం నడుస్తుంది. సచివాలయాల ఉద్యోగుల ద్వారా పట్టాలు పంపిణీ చేయడం విశేషం. తమకు భూములు ఎక్కడ ఇస్తున్నారని అడిగితే ముందు పట్టాలు తీసుకోండి వారం రోజుల్లో భూములు చూపిస్తామంటున్నారు. ఏదో విధంగా మభ్యపెట్టి ఓటు పొందాలని చూస్తున్నారు. ఇప్పటికే చీరలు, గిఫ్టులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.





నిడదవోలు ఆర్వోబీ పనుల వద్ద మట్టిలో దిగబడిన లారీ

లారీ బయటకు వచ్చిన తరువాత మిగిలిన గొయ్యి

ఫ్లయ్ ఓవర్ కష్టాలు

- ఆర్వోబీ నిర్మాణంతో ప్రజలకు తప్పని ఇక్కట్లు
- నిర్మాణ పనుల వద్ద కానరాని భద్రత చర్యలు
- ఇష్టారాజ్యంగా జరుగుతున్న పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పర్యవేక్షించని ప్రభుత్వ అధికారులు..పాలకులు

నిడదవోలు, మార్చి 15 : ప్రజలకు ఫ్లయ్ ఓవర్ కష్టాలు తప్పడం లేదు. పాలకుల చేతగానితనం.. అధికారుల అలక్ష్యం.. కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది.. ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నా తీరు మారడంలేదు.. ఏ రోజుకారోజు బాగుపడుతుందిలే అనుకుంటే రోజురోజుకు సమస్య తీవ్రమవుతుండడంపై ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు ఆర్వోబీ నిర్మాణం గోదావరి జిల్లాల ప్రజల చిరకాల కోరిక..ఈ ఆర్వోబీ పనులు ఆరంభమైన నెల రోజుల్లోనే ప్రజలు మా కొద్దు బాబోయ్ అనేలా అవస్థలు పడుతున్నారు. ఈ పనుల వద్ద ఎటువంటి భద్రత చర్యలు తీసుకోకపోవడంతో ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నిడదవోలు నెహ్రూ బొమ్మ సెంటరులో ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో సుమారు రెండు నెలల కిందట మెయిన్ రోడ్డు నుంచి గాంధీ బొమ్మ సెంటరు వరకు ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ఈ పనుల కారణంగా స్థానికులతో పాటు ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులంతా అవస్థలు పడుతున్నారు. ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనుకుంటూ భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్వోబీ నిర్మాణ పనుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం..ఇష్టానుసారంగా పనులు సాగుతుండడంతో భయపడుతున్నారు. అయితే ఆర్‌వోబీ నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తా లేకుండా పోవడంతో రోజురోజుకు సమస్య జఠిలమవుతోంది. ఒక పక్క ఆర్వోబీ నిర్మాణ పనులు సాగుతుండగానే దానిని అనుకునే స్కూల్ బస్సులు, భారీ లారీలు, రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఒక్కసారిగా భారీ లారీ ముందు టైరు దిగబడిపోయింది. అప్పటికే ఆ ప్రాంతంలో భూమిలోకి వేసిన రెండు పిల్లర్ల మధ్య దిగబడిపోవడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. మరోపక్క దిగబడిన లారీ మెల్లమెల్లగా దిగబడిపోతూ గొయ్యి పెద్దది అవుతుండడంతో భారీ క్రేన్‌తో లారీని బయటకు లాగించారు. తీరా చూస్తే రెండు పిల్లర్ల మధ్య భారీ గొయ్యి అలాగే ఉండిపోయింది. ఆర్వోబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పనులను పరిశీలించడం కాని, అధికారులను సమన్వయ పరచి సజావుగా ఆర్వోబీ పనులు జరిగేలా చర్యలు తీసుకోవడం లేదని ఇటు పట్టణ ప్రజలు, కంపెనీ ప్రతినిధులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

జిల్లా పశుసంవర్ధక అధికారిగా శ్రీనివాసరావు



రాజమహేంద్రవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పశు సంవర్థక శాఖాధికారిగా టి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.అనంతరం కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. నిర్దేశిత పాల సేకరణ లక్ష్యాల ప్రకారం జిల్లాలో ఆయా పాల కేంద్రాల నుంచి ప్రతి రోజూ 160 లీటర్ల పాలను సేకరించడానికి చేపట్టిన ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. 1993లో సహాయ పశు వైద్యాధికారిగా చిలకలూరిపేట మండలంలో శ్రీనివాసరావు పశు సంవర్థక శాఖలో ఉద్యోగ జీవితం ఆరంభించారు.వృత్తిలో అంకిత భావంతో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారు.గుంటూరు జిల్లా తాడికొండ ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో సహాయ సంచాలకుడిగా పనిచేస్తూ ఉప సంచాలకుడిగా జిల్లాకు వచ్చారు.



ఇంటర్ పరీక్ష ముగిసిన అనంతరం బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

గోపాలపురం, మార్చి 15 : ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఎక్కడా ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జరిగిన ఈ పరీక్షలకు రెండు పరీక్షా కేంద్రాలు అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఏ జిల్లా పరిధిలోని విద్యార్థులు ఆ జిల్లాలోనే పరీక్షలు రాయాలని అధికారుల నుంచి ఆదేశాలు అందాయి.ఈ మేరకు అదే విధంగా జరిగాయి.తూర్పుగోదావరి జిల్లాలో కొత్తగా 10 మండలాలు కలిశాయి. ఆయా మండలాల విద్యార్థులు జిల్లా పరిధిలోనే పరీక్షలు రాశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.పరీక్షల చివరి రోజు కావడంతో తల్లిదండ్రులు విద్యార్థుల వెంట తరలి వచ్చారు. పరీక్ష ముగిసిన వెంటనే తమ వెంట తీసుకుపోయారు. కొంత మంది విద్యార్థులు మాత్రం పరీక్షలు ముగియడంతో స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపారు. గురువారం జూనియర్ ఇంటర్ పరీక్షలు ముగిశాయి.

ఎటు చూసినా వీళ్లే!

ఇదేం ఖర్మరా బాబూ!



- ఓటు అడిగే త్రోవ లేక.. ప్రచార యావ!?
- రోడ్లు.. హోర్డింగులు.. ఇళ్లకూ వైసీపీ ఫ్లెక్సీలే
- రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటుతో ట్రాఫిక్ ఇబ్బందులు
- బాబోయ్ చూడలేకపోతున్నామంటున్న జనం
- బహిరంగ సభ మైదానాలపై ఖర్చీఫ్
- కనీస అనుమతులు లేకుండానే ఏర్పాటు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎటు చూడు వైసీపీ హోర్డింగ్స్.. కటౌట్లే.. ఏ ఫ్లెక్సీ చూసినా సిద్ధం సిద్ధం అంటున్నారు.. ఐదేళ్లలో అభివృద్ధి చేయడం చేతగాని వైసీపీ నాయకులు ఎన్నికల నియమావళికి కూతవేటు దూరంలో ఒక పక్క సిద్ధం అంటూ మరో పక్క నాకో కల ఉంది అంటూ ఓట్ల కో సం వల వేస్తున్నారు. అయితే ఓటర్లు ఒక్క చాన్స్ అంటే ఐదేళ్ల అవకాశం ఇచ్చాం.. మోసపోయాం.. సిద్ధం అంటే ఎలా ఇస్తాం.. అంటున్నారు. జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా ఫ్లెక్సీలతో ఊదరగొట్టేస్తున్నారు. గుడి దగ్గర, బడి సమీపంలో, జంక్షన్ల నిండా, డివైడర్ల మధ్యలో స్తంభాలకు, బస్ షెల్టర్లకు.. ఎక్కడ చూసినా వైసీపీ బొమ్మలతో కూడిన పోస్టర్లు, తాత్కాలిక ద్వారాలతో నింపే స్తున్నారు. ప్రతిపక్షాల ప్రచారానికి చోటు లేకుండా చేయాలనే కుతంత్రాలతో కొందరు నాయకులు సభా మైదానాలు, హోర్డింగ్ లను రోజుల పాటు బుక్ చేసేసుకున్నారు. దీనికి తోడు మొబైల్ ప్రచార వాహనాలతో హోరెత్తిస్తున్నారు. రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంలో ఎక్కడ చూసినా ఎంపీ భరత్‌రామ్ ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. వీటిపై 'అభివృద్ధికి సిద్ధం' అని ఉండడం చూస్తున్న జనం.. ఈ నాలుగేళ్ల పది నెలల్లో అభివృద్ధి చేయకుండా మళ్లీ 'సిద్ధమే మిటి?' అని ప్రశ్నిస్తున్నారు. అధికారం మాటున ఏర్పాటు చేస్తున్న ఈ ప్రచార బోర్డులకు వేటికీ అనుమతులు లేకపోవడం గమనార్హం.

ఎందుకీ చిన్నెలు..

జిల్లా వ్యాప్తంగా తరచుగా సభలు ఏర్పాటు చేసుకునే మైదా నాలను వైసీపీ నాయకులు 20 రోజుల వరకూ ముందస్తుగా వివిధ పేర్లతో చేబట్టారని తెలుస్తోంది. అలాగే ప్రైవేటు వారి చేతుల్లో ఉండే హోర్డింగులను భయాన చెరబట్టారని సమాచారం. దీంతో ఎక్కడ హోర్డింగులు చూసినా వైసీపీ ఫ్లెక్సీలే కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని హోర్డింగులను నెల రోజులకు వైసీపీ నేత తన గుప్పిట్లో బంధించేశారని సమాచారం. అలాగే సిటీలో సభలకు అనుకూలంగా ఉండే సుబ్రహ్మణ్య మైదానాన్ని 20 రోజుల పాటు బుక్ చేసుకున్నారని తెలుస్తోంది. దీంతో మైదానంలో వైసీపీ కటౌట్లను, ఫెక్సీలను తొలగించకుండా రోజూ అలాగే ఉంచుతున్నారు.వైసీపీ నాయకులు ఇష్టానుసారం ఫెక్సీలు, హోర్డిం గులు, బోర్డులు, పోస్టర్లు పెడుతుండడం అటు అధికారులకూ చిరాకు రప్పిస్తోందని అంటున్నారు. అధికార పార్టీ కావడం, వారు అడ్డమైన మార్గాల్లో వెళతారనే అనుభవం ఉండడంతో వెనకడుగు వేస్తున్నారు.ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన మరుక్షణమే కటౌట్లు దించేయడానికి, హోర్డింగులపై ఫెక్సీలు తొలగించ డానికి అధికా రులు 'సిద్ధం'గా ఉన్నారని చెబుతున్నారు.సిబ్బందికి ఈ మేరకు అధికారులు మౌఖిక ఆదేశాలూ జారీ చేశారట. దీంతో నోటిఫికేషన్ వచ్చీ రావడంతో ఫ్లెక్సీలను తొలగించే పని పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. పర్యా వర ణానికి హానికరమైన ఈ ఫెక్సీలను ఏ విధంగా ధ్వంసం చేస్తారోనని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా గతేడాది మే నెలలో జరిగిన మహానాడులోనూ వైసీపీ నాయకులు ఇలాగే అడ్డుతగిలారు..నాడు జనం వైసీపీ అడ్డంకులను అధిగమించి మహానాడు విజయవంతం చేశారు. ఎన్నికల వేళ ఇబ్బందులు పెడుతున్నారు. టీడీపీ ఫ్లెక్సీలు చించివేసి.. హోర్డింగ్‌లు అద్దెకు ఇవ్వ కుండా చేస్తున్నారు. దీంతో ఎన్నికల్లో కూడా తమదే విజయమని టీడీపీ నాయకులు అంటున్నారు.

అభివృద్ధి చేతకాక..

జగన్ కల్లబొల్లి మాటలను నమ్మి జనం అధికార పీఠం ఎక్కించి నాలుగేళ్ల పది నెలలైంది. ఇప్పటి వరకూ చేసిన అభివృద్ధి గురించి వైసీపీ నాయకులు స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. పంచాయతీలకు వచ్చిన కేంద్ర నిధులతో చేసిన పనులనూ వైసీపీ పాలకుల ఖాతాలో వేసుకున్నారు.ఆ నిధులతో కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్లపై కూడా వైసీపీ నాయకులు బొమ్మల ప్రదర్శన చేశారు. ఏ నియోజకవర్గంలోనూ చెప్పుకోదగిన పనులు జరగలేదనేది వాస్తవంగా కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఆర్భాటాలు తప్ప చిత్తశుద్ధి లేదని జనం విమర్శిస్తున్నారు. ఇన్నాళ్లలో కుడి చేతితో పంచేసి ఎడమ చేతితో పిండేయడం తప్ప ఏ వర్గాలకూ వైసీపీ ప్రభుత్వం చేసిన మేలు లేదు. రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, మంచినీటి సదుపా యం వంటివేమీ పట్టించుకోలేదు. గోదావరి నది పక్కనే ఉన్నా ఈ నాటికీ నీటి కోసం కటకటలాడే ప్రాంతాలు రాజమహేంద్రవరం చుట్టుపక్కల గగ్గోలు పెడుతున్నాయి. ఈ నాలుగేళ్ల పది నెలలూ ప్రధాన సమస్యలను 'గాలి'కి వదిలేయడంతో ఇప్పుడు ప్రజల వద్దకు ఓటు కోసం ఎలా వెళ్లాలో ముఖం చెల్లని వైపీపీ నాయ కులు చీరల పంపిణీ, ఫ్లెక్సీలతో అవాస్తవ ప్రచారాలనే నమ్ముకోక తప్పని పరిస్థితి వచ్చింది.

హద్దులే లేని ప్రచార పిచ్చి..

కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం, రాజానగ రం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్‌లో చిన్న చిన్న రోడ్లను కూడా వైసీపీ పోస్టర్లతో నింపేశారు. ప్రచార యావ బాగా తలకెక్కిన వైసీపీ నాయకులకు ప్రజల ఇబ్బందులు పట్టడంలేదు.జిల్లా కేంద్రమైన రాజమహేంద్ర వరంలోని గోదావరి గట్టు, పుష్కరఘాట్ తదితర ప్రాంతాల్లో సాధారణంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. సాయం త్రం వేళల్లో ఇక్కడ ట్రాఫిక్ నియంత్రించడంలో పోలీసులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటారు. వాహనదారులు నరకం చూస్తూ ఉంటారు. ఈ ఇక్కట్లు కూడా వైసీపీ నాయకులకు కనిపించడం లేదు. పుష్కర్‌ఘాట్, గోదావరి గట్టుపైన ఉమామార్కండేయ స్వామి దేవాలయం వద్ద వైసీపీ నాయకులు తాత్కాలిక ద్వారాలు ఏర్పాటు చేశారు. ఈ ద్వారాలతో ఆ ప్రాంతాలు మరింత ఇరుకుగా మారిపోవడంతో ట్రాఫిక్‌కి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డివైడర్ల మధ్య, రోడ్ల పక్కన కరెంటు స్తంభాలను వైసీపీ ఫ్లెక్సీలతో నింపేశారు. ఇక సులభ్ కాంప్లెక్సులు ఒకటే మిగిలి ఉన్నాయని జనం ఎద్దేవా చేస్తుండడం గమనార్హం. కటౌట్లకు, ఫెక్సీల ఏర్పా టుకు అనుమతుల్లేకపోయినా అధికారులు నోరెత్తలేని పరిస్థితి.





ఇది తగునా : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద శివరాత్రి రోజున రోడ్డు మధ్యన పెట్టిన ఫ్లెక్సీలు.. నాటి నుంచి ఇలాగే వదిలేశారు..





జయహో బీసీ సభకు హాజరైన అశేషజనం.. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరికి తెలుగు మహిళల పూలమాల

రాష్ట్రానికి ఏం చేశావని ఓటెయ్యాలి!

- జగన్ పాలనపై మండిపడిన అయ్యన్న
- కూటమిని గెలిపిస్తేనే రాష్ట్ర భవిష్యత్
- ఆలోచించి ఓటెయ్యాలని పిలుపు
- జయహో బీసీ సభ విజయవంతం

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం మార్చి 15 : అసలు రాష్ట్రానికి ఏమి చేశావు జగన్? ఓ పోలవరం చేశావా ? ప్రత్యేకహోదా తెచ్చావా ? పరిశ్రమలు తెచ్చావా ? నిరుద్యోగ సమస్య తీర్చావా ? ఏమి చేశావని నీకు ఓటెయ్యాలో చెప్పు అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మరో మూడు నెలల్లో జగన్ జైలుకెళ్లడం ఖాయం అన్నారు. చివరి రక్తపు బొట్టు వరకు గోరంట్ల, నేను పార్టీ కోసం పనిచేస్తాం.మేము చచ్చే వరకు పార్టీని కాపాడుకుంటాం..చచ్చాక కూడా పార్టీ జండా కప్పుకుంటాం అన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి టీడీపీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. పెన్షన్ పథకాన్ని అన్న ఎన్టీఆర్ పెడితే దానిని పెంచింది చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల వాటా 24 శాతం ఎన్టీఆర్ పెడితే దానిని 34 శాతానికి చంద్రబాబు పెంచారని చెప్పారు. ఇపుడు జగన్ దానిని 24 శాతానికి తగ్గించడం వల్ల రాష్ట్రంలో బీసీ వర్గాలకు చెందాల్సిన 16 వేల పదవులు పోయాయన్నారు. చేతి వృత్తులకు ఆదరణ కరువైందన్నారు. రాష్ట్రంలో 279 మంది బీసీలు ఈ నాలుగేళ్ల 11 నెలల కాలంలో హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బీసీ రక్షణ చట్టాన్ని తెస్తున్నట్టు తెలిపారు. రూరల్ నియోజకవర్గం విషయానికి వస్తే ఒక చోట పనిచేయని అవినీతి మంత్రిని అక్కడ ప్రజలు తిరస్కరిస్తే రూరల్‌కు పంపించారని, అక్కడ గుళ్ళు, గోపురాలు, కాలవగట్లు, అన్ని ఖాళీ చేసిన అమాత్యులు ఇక్కడ దోపిడీకి వచ్చారన్నారు. ఆలీబాబా 40 దొంగల్లాగా ముఠాలుగా ఒకరే ఈ మంత్రి అని ఆరోపించారు. ఈయన పాత్రలు, చీరలు పంపిణీ చేసి ఓట ర్ల ప్రలోభానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ భరత్‌రామ్ పనికిరాని భూములను కొనుగోలు చేయించి మరో చోట భూములకు బోగస్ పట్టాలు తయారు చేసి మభ్యపెడుతున్నాడని అవి ఎందుకు పనికిరావన్నారు. దగా పడ్డ ప్రజలు ఆలోచించుకుని దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని..బీసీలంతా ఏకమై కూటమిని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. టీడీపీ సీనియర్‌నేత వినుకొండ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీ వర్గాల అభ్యున్నతి కి చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. బీసీల అభ్యున్నతి తెలుగుదేశంతోనే సాధ్యం అని రూరల్ నుంచి పోటీ చేస్తున్న గోరంట్లను గెలిపించాలని కోరారు. నూర్ బాషా సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమైందన్నారు. డా.వెంకటరమణ మాట్లాడుతూ బీసీ వర్గాలకు చెందిన పిల్లలు చదువుల్లో రాణించడానికి ఆనాడు తెలుగు దేశం ప్రభుత్వం అమలు చేసిన పథకాలే కారణం అన్నారు. గోరంట్ల, అయ్యన్నపాత్రుడు ఇద్దరినీ గజమాలతో సత్కరించారు. అటుపై గోరంట్ల పుట్టిన రోజు పురస్కరించుకుని వేదికపై కార్యకర్తలు, నాయకులు సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గోరంట్ల కుమార్తె శిరీష, టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, యర్రా వేణుగోపాలరాయుడు, వాసిరెడ్డి రాంబాబు, తెలుగు మహి ళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ, మార్ని వాసు, పందూరి అప్పారావు, ప్రత్తిపాటి రామారావు చౌదరి, పిన్నింటి ఏక బాబు, పితాని శివరామకృష్ణ, దండమూడి ప్రసాద్, ముత్తాబత్తుల విజయ, గుత్తుల కృష్ణ, యార్లగడ్డ శేఖర్, యనమదల రాజు, బత్తిన ఏడుకొండలు, ధర్మరాజు, దండమూడి ప్రమీల,జోగి చక్రవర్తి, కొయ్యనకుమారి, మత్యేటి ప్రసాద్, ప్రత్తిపాటి రామారావుచౌదరి, యార్లగడ్డ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

కచ్చితంగా పోటీలో ఉంటా

- చంద్రబాబు, లోకేశ్‌ల ఫొటోలతో ముందుకెళ్తా
- ఈ పోటీ అచ్చిబాబుతోనే చంద్రబాబుతో కాదు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్



కొవ్వూరులో పాత్రికేయులతో మాట్లాడుతున్న జవహర్

కొవ్వూరు, మార్చి 15: 'ఖచ్చితంగా నేను పోటీలో ఉంటాను, పార్టీకి రాజీనామా చేయను, కొవ్వూరులో పార్టీ జెండాలతోనే ప్రచారానికి వెళ్తాను. అధిష్ఠానం తిరిగి పునరాలోచనా చేయాలి' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ పేర్కొన్నారు. కొవ్వూరులోని తన నివాసంలో పాత్రికేయులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి తనను వ్యతిరేకించిన వ్యక్తులు పార్టీ కోసం ఏనాడు పని చేయలేదని, చంద్రబాబు జైలులో ఉండగా కనీసం పలకరించలేదని, ధర్నాలు చేయలేదన్నారు. తనపై 14 కేసులు ఉన్నాయని, అచ్చిబాబుపై ఒక్కటీ లేదన్నారు. చంద్రబాబు, లోకేశ్ ఫొటోలతోనే ముందుకు వెళ్తానన్నారు. ఈ పోరాటం అచ్చిబాబుకి తనకు తప్ప, చంద్రబాబుతో కాదన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 11 మంది ఆశావహులను పెట్టుకున్నారని, ఒక్కొక్కరితో కోట్లాది రూపాయలు ఖర్చు చేయించారని, వారిలో ఒక్కరు కూడా నచ్చలేదా అని ప్రశ్నించారు. అక్కడి చెత్త ఇక్కడ బంగారం అవుతుందా అని బహిరంగ సభల్లో విమర్శించిన వారికి అక్కడ చెత్త ఇక్కడ బంగారం ఎలా అయ్యిందో తమకు తెలియదని, ఆ బంగారాన్ని ఎలా గెలిపిస్తారో చెప్పాలన్నారు. నిర్ణయం తీసుకునేముందు తనను సంప్రదించక పోవడం ఏకపక్షంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యక్తులుగా ప్రజల మనస్సుల్లో ఏముందో అదే ఆచరిస్తామన్నారు. కచ్చితంగా పోటీలో ఉంటానన్నారు. కార్యక్రమంలో ముప్పిడి రాజు, రాపాక శ్రీనివాస్, బూరుగుపల్లి వీరరాఘవులు, వేగి చిన్నా, కోడూరి ప్రసాద్, చావా శ్రీనివాస్, తిగిరిపల్లి గోపి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ

కొవ్వూరు, మార్చి 15: కొవ్వూరులోని వాత్సల్యా వృద్ధాశ్రమం, అందుల పాఠశాలలో శ్రీ శివసాయి దామం సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. సమితి కార్యదర్శి తాతయ్యబాబు మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో కొవ్వూరులో గోదావరి ఒడ్డున హిందూ శ్మశానవాటిక నిర్వహణతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నగళ్లపాటి శ్రీనివాస్, పరిమి రాజేష్, యాళ్ల నాగేశ్వరరావు, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఎన్డీఏ కూటమి తొలి బహిరంగ సభ

కొవ్వూరు, మార్చి 15: ఈ నెల 17న పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలో జరగనున్న ఎన్డీఏ కూటమి తొలి బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కొవ్వూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని మళ్లీ నిలబెట్టడానికి కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు అవసరమన్నారు. ప్రధాని మోదీ పాల్గొనే ఈ సభ రాష్ట్రంలో నవశకానికి పడుతున్న తొలి అడుగన్నారు. ఈ సభను మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు.

అశ్రద్ధ చేస్తే శాశ్వత అంధత్వం



నల్లజర్ల కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రేష్మ

నల్లజర్ల, మార్చి 15: కంటి సమస్యలపై అశ్రద్ధ చేస్తే శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదముందని కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్‌కే రేష్మ అన్నారు. ప్రపంచ గ్లకోమా నివారణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి శుక్లాలు వచ్చినప్పుడు క్యాటరాక్ట్ శస్త్ర చికిత్స సకాలంలో చేయించుకోవాలన్నారు. అశ్రద్ధ చేస్తే అది గ్లకోమాగా పరిణమించి శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులోని ఇందిరమ్మ కాలనీలో గ్లకోమాపై అవగాహన ర్యాలీ జరిగింది. గ్లకోమా వ్యాధి కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాలు చచ్చుబడిపోయేలా చేస్తుందని డాక్టర్ మనోజ్‌కుమార్ అన్నారు. దీని వల్ల కంటిచూపు తగ్గిపోతుందని, వైద్య పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ పెంటపాటి గురుస్వామి పాల్గొన్నారు.

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి

నల్లజర్ల, మార్చి 15: ప్రతి గర్భిణీ, బాలింత పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని ఐసీడీఎస్ గోపాలపురం సీడీపీవో బాల త్రిపురసుందరి అన్నారు. పోషణ పట్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోతవరం -49లో బాలింతలకు, గర్భిణులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి, పీహెచ్ఎన్ఎం ఇందిరా, అంగన్‌వాడీ టీచర్ రూత్ సుశీలా, కస్తూరి, చంద్రరేఖ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

నల్లజర్ల, మార్చి 15: మండలంలోని నల్లజర్ల, అనంతపల్లి, చీపురుగూడెం గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. శుక్రవారం నల్లజర్లలోని అల్లాడ రామకృష్ణ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆమె లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వగా అనంతపల్లిలో చెల్లారి శ్రీనివాసరావు ఇంటి వద్ద లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి, కారుమంచి రమేష్, చెల్లు హరిబాబు, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, బంకా అప్పారావు, చెల్లారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు రామప్రసాద్‌కు ప్రధాని ప్రశంసాపత్రం

ఉండ్రాజవరం, మార్చి 15: ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులు, ఉపాధ్యాయులతో జాతీయస్థాయిలో పరీక్షలపై పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యక్షంగాను, పరోక్షంగా వర్చువల్‌గా పాల్గొన్నారు. ఉండ్రాజవరం హైస్కూల్ జూనియర్ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు కోట రామప్రసాద్ వర్చువల్‌గా పాల్గొని, ఓపెన్ బుక్ సిస్టం నిర్వహణతో పరీక్షలో మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టవచ్చని గతంలో విద్యారంగ మేధావులు తెలియజేసిన విషయాన్ని వర్చువల్‌గా ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆయన తెలిపారు. ఈ చర్చా కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నందుకు తనకు ప్రధాని ఈ మెయిల్ ద్వారా ప్రశంసాపత్రం పంపినట్టు వివరించారు. ఈ సందర్భంగా రామప్రసాద్‌ను హెచ్ఎం వి.విశ్వప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ కరెళ్ల సోమేశ్వరరావు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ

తాళ్లపూడి, మార్చి 15: మండలంలో పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవోలు చింతాడ బాలామణి, చెరుకూరి నెహ్రూజీ తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకూ పరీక్షలు జరుగుతాయని, మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం, మలకపల్లి-ఎ, మలకపల్లి-బి కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. తాళ్లపూడిలో 280, వేగేశ్వరపురంలో 280, మలకపల్లి-ఎ సెంటరులో 200, మలకపల్లి-బి సెంటరులో 150 మంది విద్యార్థులు హాజరవ్వనున్నారని తెలిపారు. ఈ నాలుగు కేంద్రాలకు 44 మంది ఇన్విజిలేటర్లు, ఒక రూట్ ఆఫీసర్‌ను నియమించినట్టు తెలిపారు.

సాంకేతిక ఆవశ్యకత పెరిగింది

దివాన్‌చెరువు, మార్చి15: నేటి ఆధునిక కాలంలో సాంకేతిక ఆవశ్యకత ఎంతో పెరిగిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్, మిషన్ లెర్నింగ్ అంశాలపై ఎస్ఆర్‌టీ టెక్ ఐకాన్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలు అందరికీ అవసరమన్నారు. సంస్థ సీఈవో ఎస్‌వీడీ రవితేజ, వెంకట భమిడిపాటిలు శిక్షణా అంశాలను వివరించారు.

ప్రజా సేవకుడిగా ఉంటా

- కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు సైనికుల్లా పనిచేయాలి
- కొవ్వూరు టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి

కొవ్వూరు, మార్చి 15: ఒక సేవకుడిగా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకటించిన తరువాత మొదటిసారిగా శుక్రవారం కొవ్వూరు విచ్చేసిన ఆయనకు మెరకవీధి వినాయకుని గుడి వద్ద ద్విసభ్య కమిటీ కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో మూడు పార్టీల నాయకులు ఘన స్వాగతం పలికారు. గుడి నుంచి ర్యాలీగా స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయానికి చేరుకుని పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ తాను 2014-2019లో గోపాలపురం ఎమ్మెల్యేగా పనిచేశానన్నారు. 2000 సంవత్సరం నుంచి టీడీపీ కార్యకర్తగా పనిచేస్తున్న తనకు చంద్రబాబు మూడు సార్లు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పించారన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి కష్టం తెలిసిన వ్యక్తినయిన తాను ఎప్పుడూ ఒక ఎమ్మెల్యేగా ఫీలవ్వలేదన్నారు. ఒక కార్యకర్తగా, సేవకుడిగా అందరికీ సేవ చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరీల నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఎన్నికల పూర్తయ్యేవరకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త నిరంతరం కష్టపడాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, డేగల రాము, ఆళ్ల హరిబాబు, గారపాటి శ్రీదేవి, బేతిన నారాయణ, అక్కిన రాంబాబు, మరపట్ల కళాధర్, వేమగిరి వెంకట్రావు, సూరపనేని చిన్ని, కంటిపూడి శ్రీనివాస్, నాదెళ్ల శ్రీరామ్, కేవీకే రంగారావు, కలగర సుబ్బారావు, కాగిత రఘు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు



ముప్పిడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీవీ రామారావు

టీడీపీ టిక్కెట్ల కేటాయింపులో మాలలకు అన్యాయం

మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం

రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ విమర్శించారు. శుక్రవారం కొవ్వూరులో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 3 ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలు ఉన్నాయని, వాటిలో కనీసం ఒక్క సీటూ మాలలకు ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. కృష్ణా జిల్లా, కడప, అనంతపురం జిల్లాల్లోను ఇదే పరిస్థితి ఉండడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికల పట్ల పునరాలోచన చేసి మాలలకు ప్రాధాన్యం కల్పించకపోతే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లు తుందన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగినది మాల సామాజిక వర్గమేనని, వారిని విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

ముప్పిడిని గెలిపించుకుంటాం : టీవీ రామారావు

ముప్పిడి వెంకటేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు కానుకగా అందజేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు విచ్చేసి, తనను జనసైనికుల సమక్షంలో మర్యాదపూర్వకంగా కలిసిన ముప్పిడికి ఆయన పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తాను అభ్యర్థిగా రేసులో ఉన్నప్పటికీ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సంయుక్తంగా తీసుకున్న నిర్ణయానికి గౌరవమిస్తూ వెంకటేశ్వరరావు విజయానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామన్నారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్‌ను కలవడానికి ఇంటికెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కొవ్వూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు.. పలుచోట్ల కేంద్ర బలగాల కవాతు



చాగల్లు: గౌరిపల్లిలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చాగల్లు, మార్చి 15: ప్రజలు స్వేచ్ఛగా, ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కొవ్వూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని దారవరం, మార్కొండపాడు, చంద్రవరం, మల్లవరం గ్రామాలల్లో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకొనేలా భరోసానిస్తూ ఈ కవాతు నిర్వహించామని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని చోడవరం, అనంతపల్లి గ్రామాల్లో సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని ఆయన అన్నారు. ఎస్ఐ టీవీ సురేష్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్టు ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు. ప్రజలంతా తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఇంటింట ప్రచారాన్ని వేగవంతం చేయాలి

- రామకృష్ణారెడ్డి.. బలభద్రపురంలో టీడీపీలోకి చేరికలు

బిక్కవోలు, మార్చి 15: ఎన్నికలు దగ్గరవుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇంటింటా ప్రచారం చేయాలని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బలభద్రపురంలో శుక్రవారం మండల టీడీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టో, జనసేన, బీజేపీతో టీడీపీ ఎందుకు కలసి ఎన్నికలకు వెళ్తుందో ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వైసీపీకి చెందిన మల్లిడి కనకప్రసాద్‌రెడ్డి, తేతలి సుబ్బారెడ్డి, దర్శి సత్యానందం ఆధ్వర్యంలో 20 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి రామకృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో చంద్రబాబు నిర్వహించబోయే ప్రజాగళం సభకు బలభద్రపురంలో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్ఎస్.పేట రైల్వే వ్యాగన్ డైలీ లేబర్ కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, మల్లిడి అబ్బాయిరెడ్డి, రేలంగి నాగేశ్వరరావు, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవానందరెడ్డి పాల్గొన్నారు. కాగా ఆర్ఎస్ పేటలో యువనేత నల్లమిల్లి మనోజ్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర భవిష్యత్తు టీడీపీ, జనసేన, బీజేపీతోనే సాధ్యమని వివరించారు. ఆయన వెంట పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, గొర్రెల త్రిమూర్తులు, మాడా మోహన్, బోను సూర్యకుమార్ తదితరులున్నారు.



బలభద్రపురంలో టీడీపీలో చేరిన కార్యకర్తలతో రామకృష్ణారెడ్డి

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలి: వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15: జగన్‌ను నమ్మి మోస పోయిన ప్రజలందరు 2024 ఎన్నికల్లో భావితరాల భవిష్యత్తుకోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక 4వ డివిజన్‌లో తాడేపల్లి గూడెం టీడీపీ పరిశీలకుడు నక్కా చిట్టిబాబు ఆధ్వర్యంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్ పర్యవేక్షణలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఆదిరెడ్డి వాసు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనసూరి ప్రసాద్, అనసూరి శ్రీను మరికొంత మందికి పార్టీ కండువాలు కప్పుకుని టీడీపీలో చేరారు.ఈ కార్యక్రమంలో బండారు శ్రీను, కొండిశెట్టి రామకృష్ణ, బొట్టా వీరబాబు, దారా రాజు, మొతికి మురళీకృష్ణ, గుత్తుల రమేష్, వెల్లంకి మణికంఠ, కర్రి మహేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ అత్యవసర సమావేశం

అనపర్తి, మార్చి 15: టీడీపీ అనపర్తి నియోజకవర్గ కార్యకర్తల అత్యవసర సమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నట్టు జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

దేవరపల్లికి ఫైర్‌స్టేషన్ మంజూరు

హోం మంత్రి తానేటి వనిత వెల్లడి

దేవరపల్లి, మార్చి 15: దేవరపల్లికి రూ.2.74 కోట్ల నిధులతో ఫైర్ స్టేషన్ మంజూరైనట్టు హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం రాత్రి తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలో ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రధానంగా పొగాకు బ్యారన్లు, చిన్న చిన్న పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో పాటు ఏదైనా ఫైర్ యాక్సిడెంట్ జరిగితే కొవ్వూరు, నిడదవోలు నుంచి ఫైర్ వాహనం రావాల్సి ఉండేదని అన్నారు. దేవరపల్లిలో ఫైర్ స్టేషన్ మంజూరు కావడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం



రాజు (ఫైల్)

దేవరపల్లి, మార్చి 15: అతివేగంగా కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన దేవరపల్లిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. దేవరపల్లిలోని జ్యోతినగర్ కాలనీకి చెందిన నెర్లగంటి చినవెంకన్న, సత్తెమ్మ దంపతులకు నలుగురు సంతానం. రెండో కుమారుడు నెర్లగంటి రాజు(20) యువకుడు కుల వృత్తి రీత్యా ఫ్యాన్సీ, బుడగలు ఇతర వస్తువులను మోటార్‌సైకిల్‌పై వెళ్లి మండలంలోని పలు గ్రామాల్లో అమ్ముకుంటూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి పనిమీద బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామశివారు కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో దేవరపల్లి నుంచి ఏలూరు వైపు వెళుతున్న కారు యర్నగూడెం వైపు నుంచి దేవరపల్లి వస్తున్న రాజు వాహనాన్ని ఢీకొనడంతో తలకు తీవ్రగాయం కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఆసుపత్రికి తరలించారు.

బంతి సాగు లాభదాయకం

ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

దివాన్ చెరు వు, మార్చి 15: జిల్లాలోని రాజా నగరం, కడి యం ప్రాంతాలలో సార్వా వరి తరువాత బంతి సాగు వల్ల రైతులకు లాభం చేకూరుతుందని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్‌తో కలసి వెలుగుబంద, వెంగాయమ్మపేట, కడియపుసావరం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి వరి తరువాత పూలమొక్కలు సాగుచేసే రైతులను కలసి పలు సూచనలు చేశానని ఒక ప్రకటనలో తెలిపారు. మార్టేరు పరిశోధనా స్థానంలో పరిశోధనా ఫలితాలను రైతుల కమతాల్లో పరీక్ష చేసే ప్రక్రియలో భాగంగా కడియపుసావరం, వడిశలేరు ప్రాంతాల్లో సార్వా వరి తరువాత వివిధ పంటలైన మినుము, మొక్కజొన్న బంతిసాగులను పరిశీలించామన్నారు. వీటిలో బంతిసాగు చేపట్టిన రైతులకు లాభాలు ఎక్కువగా చేకూరడం గమనించామని తెలిపారు. రైతు ఎస్.సత్తిరాజు కమతంలో పంట ఆర్థిక స్థితిగతులను పరిశీలించామని, బాగా లాభాలు ఆర్జిస్తున్నారని చెప్పారు. సార్వా వరి నవంబరులో కోతకోయగానే బంతి నారు ఊడ్చారన్నారు. వాటి నుంచి పూలు కోతకు వస్తున్నాయని నిత్యం పూలమార్కెట్‌కు అమ్మి ఆదాయం పొందుతున్నారని తెలిపారు. అంతేగాక బంతిని వరికోత తర్వాత ఒకేసారి కాకుండా 15 రోజుల వ్యవధిలో పలుమార్లు నాటితే నిరాటంకంగా పూలు ఉత్పత్తి జరుగుతుందన్నారు. వివాహాది శుభ కార్యక్రమాలకు డిమాండ్‌ను బట్టి సరఫరా చేసి ఆదాయం పొందవచ్చునని చెప్పారు.

బిజినెస్ సొల్యూషన్స్‌తో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 15: ముంబయిలోని ఐడీఏ బిజినెస్ సొల్యూషన్స్‌తో భాగస్వామ్యమయ్యేలా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంది. రసాయనశాస్త్ర విభాగంలో జడ్ స్పేస్ ఇన్‌స్పైర్ ప్రొలాప్టాప్ స్టేషన్‌ను స్థాపించడానికి అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా కళాశాల బోధన, అభ్యసన వాతావరణంలో జడ్ స్పేస్, వర్క్ స్టేషన్లను వినియోగించుకుని డిజిటల్ విద్య దిశగా అభివృద్ధిని సాధించవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. జడ్ స్పేస్ తరపున సచిన్ మహేందు మాట్లాడుతూ మిక్స్‌డ్, రియాలిటీ, ఏఆర్, వీఆర్‌ల ద్వారా విద్యార్థుల అభ్యసన అనుభవాలను జడ్ స్పేస్ శక్తివంతం చేస్తుందన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నైపుణ్య సెంటర్ కో ఆర్డినేటర్ వెంకటరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, అకడమిక్ కో ఆర్డినేటర్ సంజీవ్ పాల్గొన్నారు.

99 శాతం పనులు పూర్తి చేశావా..ఎక్కడ?

- సిగ్గు లేదూ.. కడప పులివి కాదు.. పిల్లివి
- జయహో బీసీ సభలో జగన్ పై మండిపడ్డ మాజీ మంత్రి అయ్యన్న
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల



సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం మార్చి 15 : ఏటి ? రాష్ట్రంలో 99 శాతం పనులు పూర్తి చేశావా ? ఏది ఎక్కడా కనబడుట లేదు. సిగ్గులేదా జగన్ నీకు ఆ మాట అనడానికి.. నువ్వు దగా కోరువి. నువ్వు కడప పులివి కాదు.. పిల్లివి.. అందుకే నీవంటే గౌరవం లేదు అని మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామం జాతీయ రహదారి ప్రక్కన మైదానంలో శుక్రవారం రాత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. నాపై 16 కేసులు పెట్టావు ? నువ్వు చేసిన తప్పులను ప్రశ్నించినందుకు సీఐడీ ప్రయోగించావు. ఏం పీకారు అన్నారు. అసలు రాష్ట్రానికి ఏమి చేశావు జగన్ ? ఓ పోలవరం చేశావా ? ప్రత్యేకహోదా తెచ్చావా ? పరిశ్రమలు తెచ్చావా ? నిరుద్యోగ సమస్య తీర్చావా ? ఏమి చేశావని నీకు ఓటెయ్యాలో చెప్పు అన్నారు. ఏదీ ఇప్పుడు రాష్ట్రంలో పాదయాత్ర చేయి చూద్దాం... జనాలు తరిమేత్తారు మిమ్మల్ని. అమ్మలారా. అయ్యలారా మీ పెన్షన్ జగన్ నొక్కేశాడు. మీకు తెలియడం లేదు. రూ. 3వేలు పెంచుతానని చెప్పాడు. 250 చొప్పున పెంచుకువచ్చాడు. ఇలా పెంచడం వల్ల మీకు జరిగిన నష్టం ఎంతో తెలుసా ? ఒక్కొక్క పెన్షన్‌దారుడు రూ. 27,500 నష్టపోయాడు. ఇలా చాలా ఉన్నాయి. ప్రజలారా మేల్కొండి. ఇలా నమ్మితే మొత్తం ఆస్తులు అన్ని పోగొట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలతో పాటు ఈ దుర్మార్గుడు ఉద్యోగులను మోసం చేశాడు. 60 లక్షల మంది ఉద్యోగులు ఇతని వల్ల మోసపోయారు. సీపీఎస్ రద్దన్నాడు. చేతులెత్తేశాడు. పోలీసులకు కూడా చెబుతున్నాం. తొత్తులుగా మారొద్దు. ఆలోచించుకోండి. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం బాగుపడుతుంది. 140 బీసీకులాలకు లబ్ధి చేకూరుతుంది అన్నారు.

చీరలొద్దు.. విద్యుత్ చార్జీలు తగ్గించండి

రాజమహేంద్రవరం సబ్ స్టేషన్‌లోకి

వైసీపీ చీరలు విసిరిగొట్టి మహిళల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15: రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు చేతనైతే విద్యుత్ చార్జీలు తగ్గించాలే తప్పా చీరలు పంచడం కాదని మహిళలు ధర్నా చేశారు. రాజమహేంద్రవరం 30వ డివిజన్‌కు చెందిన మహిళలు జాంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఎంపీ భరత్ రామ్ ఇచ్చిన చీరలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ ఆందోళనకు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఉన్నట్లుండి ఎందుకు భరత్ రామ్ మహిళలపై నీకు అంత అభిమానం పుట్టుకొచ్చిందని ప్రశ్నించారు. చీరలు సారెలు పెట్టి ఓట్లకు గేలం వేయాలని చూస్తున్నావుకాని నీ చర్యను మహిళలంతా అసహ్యించుకుంటున్నారన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అప్పుడు ప్రజలందరికి న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మహిళలు ఎంపీ ఇచ్చిన చీరలను సబ్ స్టేషన్‌లోకి విసిరికొట్టారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, డివిజన్ అధ్యక్షుడు ఎరక కొండ, టీడీపీ నాయకులు కిషోర్, టిల్లు, తుత్తరపూడి రమణ, నరాల రమణమూర్తి, చాపల చిన్నరాజు, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, రెల్లా సత్తిబాబు, ఈపి కిషోర్, తుళ్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల పరిరక్షణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సుల్తాన్ అలీ

దేవరపల్లి, మార్చి 15: వినియోగదారుల పరిరక్షణ కోసం అసరా ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సుల్తాన్ అలీ అన్నారు. దేవరపల్లిలో అసరా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ వినియోగదారుల పరిరక్షణ దినోత్సవం కోఆర్డినేటర్ లాజరస్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సుల్తాన్ అలీ మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనేటప్పుడు దాని ప్రమాణం విలువ తెలుసుకోవాలన్నారు. ఇటీవల సైబర్ నేరాలు, మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నియంత్రించడానికి 12 రాష్ట్రాల్లో 50 చోట్ల ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. సీఐ బాలసురేష్‌బాబు మాట్లాడుతూ వినియోగదారులు, ప్రజలు సైబర్ నేరాలకు గురవుతున్నారని, అవగాహన సదస్సులు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం అభినందనీయమన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలు, ఆశావర్కర్లు, శానిటేషన్ వర్కర్లు, అంగన్వాడీలను సన్మానించారు. కార్యక్రమంలో అసరా ఫౌండేషన్ చైర్మన్ హంగ్ సన్‌యాంగ్, అడ్మినిస్ట్రేటర్ అధికారి జహ్రా, ఫౌండర్ రత్నంరాజు, రత్నరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	ఆపరేషన్ వాలంటైన్
వై.స్క్రీన్ 2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	గామి
అనన్య	భీమా

నిడదవోలు

వీ మ్యాక్స్	గామి
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	వ్యూహం

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి